News Daily
ఎడిటర్ :
B. ఉపేందర్
cknews7484@gmail.com
Visit in :
www.cknewstv.in

# CK చంద్రకాంత్ NEWS

తెలుగు దినపత్రిక

Website
cknewstv.in

సంపుటి : 03 | సంచిక :1 | ఖమ్మం | బుధవారం ఫిబ్రవరి 19, 2025 | CK NEWS | పేజీలు : 08

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Warangal, Mahabubnagar. Rangareddy, Medak, Adilabad

## రేవంత్‌కు రియల్ ఎస్టేట్ తప్ప స్టేట్ గురించి తెలియదు

### కేసీఆర్ హయాంలో రైతు రాజులా బతికాడు..

- కల్వకుర్తి నియోజకవర్గంలో నిర్వహించిన రైతు మహాధర్నాలో పాల్గొన్న కేటీఆర్
- రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజం
- కాంగ్రెస్ పాలనలో ఏ వర్గమూ సంతోషంగా లేదన్న మాజీ మంత్రి
- స్థానిక సంస్థల ఎన్నికల కోసం కాంగ్రెస్ నేతలు మళ్లీ నాటకాలు ఆడుతున్నారని వ్యాఖ్య
- ఓట్ల కోసం ఇంటికి వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపు



రంగారెడ్డి జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం ఆమన్‌గల్‌లో నిర్వహించిన రైతు మహాధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ మాట్లాడారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పాలనలో ఏ వర్గమూ సంతోషంగా లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని, ఆ పార్టీ నేతలు మళ్లీ నాటకాలు మొదలుపెట్టారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు మళ్లీ మోసపోతే ఎవరూ కాపాడలేరని కేటీఆర్ తెలిపారు. "కేసీఆర్ హయాంలో రైతు రాజులా బతికాడు. రేవంత్ రెడ్డికి రియల్ ఎస్టేట్ తప్ప స్టేట్ గురించి తెలియదు. ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ అని డ్రామాలు ఆడుతున్నారు. ఆయన సీఎం అయ్యాక సోనియా గాంధీ పుట్టినరోజు రెండుసార్లు వచ్చింది. కానీ, రుణమాఫీ 25 శాతం కూడా రాలేదు. 35 సార్లు ఢిల్లీ విమానం ఎక్కి, 35 పైసలు కూడా తీసుకురాలేదు. అప్పులు

వివరాలు 2లో..



## సైబర్ క్రైమ్స్ నియంత్రణలో తెలంగాణ నంబర్ 1

### ఫిర్యాదుల కోసం 1930 టోల్ ఫ్రీ నంబర్

### ప్రత్యేకంగా ఏడు సైబర్ క్రైమ్ ఠాణాలు

నేరం జరగకుండా జాగ్రత్త పడటమే ముఖ్యం
సోషల్ మీడియాలో విస్తృతంగా ఫేక్ న్యూస్
వాటిని నియంత్రించేందుకు చర్యలు అవసరం
సైబర్ క్రైమ్స్ అదుపునకు దేశమంతా
ఒక యూనిట్ గా పని చేయాలి : సీఎం రేవంత్ రెడ్డి

- రాష్ట్రాన్ని సెక్యూర్ బిజినెస్ హబ్‌గా మార్చాలి
- డీప్ ఫేక్‌తో వైషమ్యాలు సృష్టించే కుట్రలను తిప్పికొట్టాలి
- 'షీల్డ్-2025' సైబర్ సెక్యూరిటీ సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి

వివరాలు 2లో..

## మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు నడపండి

### ఆర్టీసీ అధికారులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశం



- ఈ నెల 26న మహాశివరాత్రి పర్వదినం
- భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక బస్సులు నడపాలన్న మంత్రి
- రద్దీగా ఉండే బస్‌స్టాండ్లలో అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలన్న మంత్రి

వివరాలు 2లో..

## ఢిల్లీ వెళ్లడం.. కేసీఆర్‌ని తిట్టడం తప్ప రేవంత్ పాలనలో ఏం లేదు



ఢిల్లీ వెళ్లడం.. కేసీఆర్‌ని తిట్టడం తప్ప రేవంత్ పాలనలో చేసేందేమి లేదని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. మంగళవారం (ఫిబ్రవరి 18) సూర్యాపేట జిల్లాలో జరుగుతోన్న పెద్దగట్టు జాతరకు ఎమ్మెల్సీ కవిత వెళ్లారు. దర్శనం అనంతరం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. లోక్ సభలో తెలంగాణ బిల్లుకు ఆమోదం తెలిపిన రోజే పెద్దగట్టు జాతరకు

వివరాలు 2లో..

## తెలంగాణ రాజకీయాల్లో రాహుల్ VS మోదీ..!

### కాంగ్రెస్, బీజేపీ మధ్య కులం, మతం పంచాది



- బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధతకు కాంగ్రెస్ యత్నం
- ముస్లింలను లిస్ట్ నుంచి తొలగించాలన్న బీజేపీ
- చిత్తశుద్ధిని నిరూపించుకోవాలంటున్న కాంగ్రెస్

హైదరాబాద్: రాష్ట్ర రాజకీయాల్లో మోదీ, రాహుల్ సెంటర్ ఆఫ్ అట్రాక్షన్ అయ్యారు. రెండు జాతీయ పార్టీల మధ్య కులం, మతం నిప్పు రాజుకుంది. మోదీ లీగల్లీ కన్వర్టెడ్ బీసీ అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు దుమారం రేపాయి. దీనిపై బీజేపీ నేతలు భగ్గమంటున్నారు. మోదీ కులం సరే.. రాహుల్ గాంధీ మతమేంటో చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. రాహల్ బ్రాహ్మిణ్ అని క్లారిటీ ఇచ్చారు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి.
అదే సమయంలో ప్రధాన మంత్రి మోదీ లీగల్లీ కన్వర్టెడ్ ఎలా అయ్యారనే అంశంపై గూగుల్ లో

వివరాలు 2లో..

## మంత్రి నారా లోకేశ్ సమక్షంలో ఏపీ ప్రభుత్వం, సింఘానియా గ్రూప్ మధ్య ఒప్పందం

- తిరుపతి జిల్లాలోని 14 స్కూళ్లలో మార్పులు తీసుకురావాలని నిర్ణయం
- క్రమంగా ఇతర ప్రాంతాలకు విస్తరణ
- ఏపీ విద్యారంగాన్ని దేశంలో నెంబర్ వన్ చేయడమే లక్ష్యమన్న నారా లోకేశ్



విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షం లో రాష్ట్ర ప్రభుత్వం, సులోచనా దేవి సింఘానియా స్కూల్ ట్రస్ట్ మధ్య ఒప్పందం జరిగింది. తిరుపతి జిల్లాల్లోని 14 పాఠశాలల్లో మార్పులు తీసుకురా వాలని నిర్ణయించారు. బోధనలో నాణ్యత, ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు.

వివరాలు 2లో..

## తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారంలో నిందితులకు ముగిసిన సిట్ విచారణ



- తిరుమల శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగం కేసు
- నలుగురు నిందితులను ఐదు రోజుల పాటు విచారించిన సిట్
- నిందితులకు తిరుపతి రుయా ఆసుపత్రి లోవైద్య పరీక్షలు

వివరాలు 2లో..

## త్వరలో అందుబాటులోకి క్యాన్సర్ టీకా




- మహిళల్లో క్యాన్సర్ నివారణ కోసం టీకా
- ఐదారు నెలల్లో టీకా అందుబాటులోకి వస్తోందన్న కేంద్రమంత్రి
- ఈ టీకా వేసుకోవడానికి 9 నుండి 16 ఏళ్ల లోపు వయస్సు బాలికలు అర్హులని వెల్లడి
- టీకాపై పరిశోధనలు పూర్తి కావొచ్చాయని, ట్రయల్స్ కొనసాగుతున్నాయని వివరణ

వివరాలు 2లో..

## తప్పుడు కేసు పెట్టి వంశీని అన్యాయంగా అరెస్ట్ చేశారు..

- కక్ష సాధింపు చర్యకు అద్దం పట్టేలా వంశీ అరెస్టన్న జగన్
- గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడి వ్యవహారంపై సత్యవర్ధన్ ఫిర్యాదు
- వంశీ తప్పులేదని న్యాయమూర్తి ముందు సత్యవర్ధన్ వాంగ్మూలం ఇచ్చాడన్న జగన్



వైసీపీ నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆరోపించారు. తప్పుడు కేసులు పెట్టి వంశీని అన్యాయంగా అరెస్టు చేశారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివరాలు 2లో..

## ఇంకా శివరాత్రే రాలేదు.. బాబోయ్.. ఇవేం ఎండలు!



- ఫిబ్రవరిలోనే సూర్యప్రతాపం
- తెలంగాణలో చాలా జిల్లాల్లో 37.7 డిగ్రీలు
- ఏప్రిల్, మే నెలలలో ఎండల మంటేనన్న ఆందోళన

సంక్రాతికి చలి గజగజా వణికిస్తుందని.. ఆ చలే శివరాత్రికి శివ శివా అంటూ వెళ్లిపోతుందని పెద్దలు అంటుంటారు. అయితే ఇంకా మార్చి నెలే రానేలేదు.. శివరాత్రికే ఇంకా సమయం ఉంది. మరి.. అప్పుడే తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. ఉదయం 11 గంటలకే సూరీడు సుర్రు మంటున్నాడు.

వివరాలు 2లో..

## సీఎం చంద్రబాబు కృషి వల్లే అది సాధ్యమైంది

- చంద్రబాబు కృషితోనే కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి కేటాయింపులు పెరిగాయని వ్యాఖ్య
- గత సర్కార్ చేసిన తప్పులు ఇప్పుడు నిధుల సమీకరణకు అడ్డంకిగా మారాయన్న మంత్రి
- ఏపీలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం నడుస్తోందన్న రామ్మోహన్ నాయుడు

వివరాలు 2లో..



# సైబర్ భద్రతలో నంబర్-1 అవుతాం

సైబర్ నేరాల నియంత్రణలో దేశానికే తెలంగాణ ఆదర్శంగా నిలుస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో సైబర్ భద్రతలో రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ), సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్(ఎస్‌సీఎస్‌సీ) ఆధ్వర్యంలో హైదరాబాద్ హెచ్ఐసీసీలో మంగళవారం 'షీల్డ్-2025' సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. 'గతేడాది సైబర్ నేరగాళ్లు దేశవ్యాప్తంగా రూ.22,812 కోట్లు దోచుకున్నారని ఒక అంచనా. ఇది మన ఆర్థిక వ్యవస్థతోపాటు పౌరులకూ ముప్పే. ఈ అంశంపై దేశవ్యాప్తంగా అందరూ సమన్వయంతో పనిచేయాల్సిన అవసరముంది. ఈ నేరాల నియంత్రణలో దేశంలో తెలంగాణ మొదటిస్థానంలో ఉంది. సైబర్ సెక్యూరిటీ బ్యూరోతో పాటు హెల్ప్‌లైన్ ఉన్న అతికొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. కేంద్రీకృత సైబర్ క్రైమ్ పోర్టల్ రూపకల్పనలో తెలంగాణ పోలీసులు కీలకపాత్ర పోషించారు. ఇప్పుడా సాంకేతికతను 27 రాష్ట్రాలు వినియోగిస్తున్నాయి. గతేడాది సుమారు 18 వేల మంది బాధితులు కోల్పోయిన సొమ్ములో రూ.183 కోట్లను తిరిగి ఇప్పించడంలో టీజీసీఎస్‌బీ కీలకంగా వ్యవహరించింది. హెల్ప్‌లైన్ నంబరు 1930 గురించి అందరికీ అవగాహన కల్పించేలా షేర్ చేయాలి. గతేడాది మా ప్రభుత్వం కొత్తగా 7 సైబర్‌క్రైమ్ పోలీస్ స్టేషన్‌లను ప్రారంభించింది' అని పేర్కొన్నారు. 'ఒకప్పుడు హత్యలు, అత్యాచారాలను తీవ్ర నేరాలుగా పరిగణించేవారు. సైబర్ నేరాలతో ఇప్పుడు తిజోరీ అర్థం మారిపోయింది. కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లే సైబర్ నేరస్థులకు తిజోరీలుగా మారిపోయాయి. వారిని గుర్తించడం.. పట్టుకోవడం.. శిక్షించడం.. ఇలా ప్రతిదీ సవాలుతో కూడుకున్నదే. దానికి తగ్గట్టుగా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలి. ప్రభుత్వం, దర్యాప్తు, ఐటీ సంస్థలు సంయుక్తంగా పనిచేసి బలమైన సైబర్ భద్రత వ్యవస్థను రూపొందించాలి. డిజిటల్ భద్రతను మెరుగుపర్చేందుకు ఏఐ, బ్లాక్‌చైన్, క్లౌడ్ సెక్యూరిటీ పరిజ్ఞానం వినియోగించాలి. రాష్ట్రాన్ని సెక్యూర్ బిజినెస్ హబ్‌గా మార్చాలి. సైబర్ నేరాల నియంత్రణలో తెలంగాణ ముందువరుసలోనే ఉన్నా ఇది సరిపోదు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు కనెక్టింగ్ బ్రిడ్జిలా ఉండాలి. ఆర్థిక నేరాలే కాకుండా సామాజిక మాధ్యమాల్లో నకిలీ వార్తల ప్రచారం సవాల్‌గా మారింది. కొందరు డీప్ ఫేక్ సాంకేతికతతో సమాజంలో వైషమ్యాల్ని సృష్టించే కుట్ర చేస్తున్నారు. అలాంటి ప్రయత్నాల్ని సమర్థంగా తిప్పికొట్టే సాంకేతికతను రూపొందించాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**త్వరలో కొత్త సెక్యూరిటీ పాలసీ: శ్రీధర్‌బాబు**

డేటా భద్రతకు సంబంధించి డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ చట్టం మార్గదర్శకాలకు అనుగుణంగా త్వరలో కొత్త సెక్యూరిటీ పాలసీని తీసుకురాబోతున్నట్లు ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఏఐ టెక్నాలజీ సాయంతో గిగావాట్ డేటా సెంటర్‌ను నెలకొల్పేందుకు సంకల్పించామన్నారు. 'సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లను తయారు చేయడంలో ప్రపంచంలో భారత్ రెండో స్థానంలో ఉన్నా ఏటా 7 బిలియన్ డాలర్ల విలువైన ఫైర్‌వాల్ మొదలుకొని యాంటీవైరస్ లాంటి సాఫ్ట్‌వేర్‌లను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడం ఆందోళనకరమైన అంశం. ఈ పరిస్థితిని నిపుణులు సమీక్షించాలి. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. సాంకేతికత మెరుగవుతున్నకొద్దీ సవాళ్లూ పెరుగుతున్నాయి. మన గురించి మన కంటే ఎక్కువగా గూగుల్‌కు తెలుస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. సైబర్ మోసాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా సైబర్ నిపుణులను తయారు చేస్తున్నాం' అని పేర్కొన్నారు. హోంశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రవిగుప్తా మాట్లాడుతూ.. సైబర్ భద్రతను మెరుగుపరిచేందుకు మరింత పటిష్ఠ వ్యవస్థలు అందుబాటులోకి రావాల్సిన అవసరముందన్నారు. డీజీపీ డా.జితేందర్ మాట్లాడుతూ.. సైబర్ నేరాల నియంత్రణ, ఛేదనలో క్రైమ్ ఓఎస్ లాంటి ఏఐ ఆధారిత పరిజ్ఞానం దర్యాప్తు సంస్థలకు కీలకంగా మారిందని తెలిపారు. ర్యాన్సమ్‌వేర్, ఏఐ ఆధారిత దాడులు, ఆర్థిక నేరాలను నియంత్రించేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ల అవసరముందని చెప్పారు. టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖా గోయెల్ మాట్లాడుతూ.. త్వరలో ఐఐటీ హైదరాబాద్, నల్సార్, ఐఎస్‌బీ లాంటి సంస్థలతో ఒప్పందం చేసుకోబోతున్నామని వెల్లడించారు. గూగుల్‌తో జరగబోయే ఒప్పందం తెలంగాణ సైబర్ రక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేస్తుందన్నారు. సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి మాట్లాడుతూ.. పోలీస్, ప్రైవేట్ భద్రత సంస్థలు, ఐటీ పరిశ్రమలు సంయుక్తంగా నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని చెప్పారు.

# రేవంత్‌కు రియల్ ఎస్టేట్ తప్ప స్టేట్ గురించి తెలియదు

- మొదటి పేజి తరువాయి

కట్టలేదని రైతుల ఇంటి తలుపులు ఎత్తుకెళ్లారు. రేపో మాపో పుస్తెలతాడు సైతం లాక్కెళ్లిపోతారు. ఓట్ల కోసం ఇంటికి వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి. కులగణన పేరుతో బీసీలను రేవంత్ రెడ్డి మోసం చేశారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్ తో పాటు సొంతూరు, అత్తగారి ఊరు కల్వకుర్తిలో ఏమైనా చేశారా? అని అడగడానికి ఇక్కడకు వచ్చాం" అని కేటీఆర్ అన్నారు.

# తెలంగాణ రాజకీయాల్లో రాహుల్ VS మోదీ..!

- మొదటి పేజి తరువాయి

వెతికేశారు నెటిజెన్లు. వాస్తవానికి మోదీ కుల వృత్తి నూనె తీయడం, అమ్మడం.. తెలంగాణలో ఈ కమ్యూనిటీని గాండ్ల తేలికులు అంటారు. మన దగ్గర బీసీ జాబితాలోనే ఉన్న ఈ కులం. మోదీ ముఖ్యమంత్రి కాకముందు గుజరాత్ లో ఓసీ లిస్ట్ లో ఉంది. వీరిని చేతి వృత్తుల వారిగా కాకుండా నూనె వ్యాపారులుగా పరిగణించి ఓసీ జాబితాలో చేర్చారు. ఆ తర్వాత చేతి వృత్తులుగా నోటీఫై చేస్తూ బీసీలకు మార్చారు. ఇదే విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి లీగల్లీ కన్వర్టెడ్ అని చెప్పారు. దీనిపై బీజేపీ నేతలు భగ్గుమన్నారు మోదీ కులాన్నే ప్రశ్నిస్తారా? అంటూ ఫీంకరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా బీసీ కులగణన చేపట్టింది. ఈ మేరకు అసెంబ్లీలో బీసీ కులాల వివరాలను వెల్లడించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ నేతలు పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు.
పలువురు వివరాలు ఇవ్వలేదని ప్రకటించిన ప్రభుత్వం తాజాగా వారి కోసం కొనసాగింపు సర్వే ను నిర్వహిస్తోంది. ఈ తరుణంలో బీజేపీ నేతలు భిన్న స్వరాలు వినిపిస్తున్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బీసీల జాబితా నుంచి ముస్లింలను తొలగించాలని, ఆ తర్వాతే బిల్లును పార్లమెంటుకు పంపితే రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్ లో పెట్టే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు.
అదే పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ.. 42% రిజర్వేషన్ కల్పించి
స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని చెబుతున్నారు. అసెంబ్లీలో తీర్మానం సరిపోతుందని అంటున్నారు. ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ హామీ అమలు చేస్తుంటే తామెందుకు మద్దతు ఇవ్వాలని మరికొందరు బీజేపీ నేతలు చెబుతున్నారు. ఏది ఏమైనా తెలంగాణ కులగణన పుణ్యమా అని రాహుల్ మతం, మోదీ కులం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి.

# తప్పుడు కేసు పెట్టి వంశీని అన్యాయంగా అరెస్ట్ చేశారు..

- మొదటి పేజి తరువాయి

నేడు విజయవాడ సబ్ జైల్లో వల్లభనేని వంశీతో ములాఖత్ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. వంశీని అరెస్టు చేసిన తీరు రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలకు నిదర్శనమని చెప్పారు. నాడు గన్నవరంలోని టీడీపీ కార్యాలయంపై దాడి జరగగా... అందులో కంప్యూటర్ ఆపరేటర్ గా పనిచేస్తున్న సత్యవర్ధన్ పోలీసులకు ఫిర్యాదు చేశారని జగన్ గుర్తుచేశారు. అదే సత్యవర్ధన్ న్యాయమూర్తి వద్ద వాంగ్మూలం ఇస్తూ.. వంశీ ఎలాంటి తప్పు చేయలేదని చెప్పారన్నారు. అయినప్పటికీ వంశీపై ప్రభుత్వం తప్పుడు కేసు పెట్టిందని ఆరోపించారు. టీడీపీ నేత పట్టాభితో నాటి గన్నవరం ఎమ్మెల్యే వంశీని అత్యంత దారుణంగా తిట్టించారని జగన్ ఆరోపించారు. అసభ్య పదజాలంతో తిడుతూ పట్టాభి రెచ్చగొట్టారని చెప్పారు. గన్నవరం వెళ్లి సవాళ్లు విసిరారని గుర్తుచేశారు.
ఈ క్రమంలో టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ జరిగిందని, టీడీపీ ఆఫీసుపై దాడికి కారణం పట్టాభి రెచ్చగొట్టడమేనని వివరించారు. పోలీసులు లాఠీచార్జి చేసి అందరినీ చెదరగొట్టారని వివరించారు. ఆ సమయంలో వైసీపీ ప్రభుత్వం ఉన్నప్పటికీ పోలీసులు పక్షపాతం చూపించలేదని, రెండు వర్గాలపై కేసులు నమోదు చేశారని జగన్ తెలిపారు. అప్పట్లో చేసిన ఫిర్యాదులో వల్లభనేని వంశీ పేరులేదని గుర్తుచేశారు. ఎందుకంటే దాడి జరిగిన సమయంలో వంశీ అక్కడలేరని వివరించారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక వల్లభనేని వంశీని టార్గెట్ చేశారని జగన్ ఆరోపించారు. ఎలాగైనా వంశీని ఇరికించాలనే కుట్రతో టీడీపీ ఆఫీసుపై దాడి కేసును రీఓపెన్ చేసి, వంశీని 71వ నిందితుడిగా చేర్చారని తెలిపారు.
వంశీ ఎట్టిపరిస్థితిలోనూ బెయిల్ పై బయటకు రాకుండా చూడాలనే ఉద్దేశంతోనే... గన్నవరం ఆఫీసును తగలబెట్టే ప్రయత్నం చేశారని వంశీపై కేసు పెట్టారని జగన్ విమర్శించారు. నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయాలనే ఉద్దేశంతో తప్పుడు కేసు పెట్టారని జగన్ మండిపడ్డారు.

# ఆక్వా రంగానికి గ్రీన్ ఎనర్జీ

ఆక్వా రైతులకు బ్యాంకు రుణాలిప్పిస్తామని.. ప్రైవేటు అప్పులకు వెళ్లకుండా చూసే బాధ్యత తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. 'పద్ధతి ప్రకారం ఆక్వా సాగు చేసుకుంటే సౌకర్యాలు కల్పించి ప్రోత్సహిస్తాం. తప్పు చేసేవారి విషయంలో కఠిన చర్యలు తీసుకుంటాం' అని స్పష్టం చేశారు. గ్లోబల్ ఫోరం ఫర్ సస్టెయినబుల్ ట్రాన్స్‌ఫర్మేషన్ (జీఎఫ్ఎస్‌టీ) ఆధ్వర్యంలో విజయవాడలో మూడు రోజులుగా జరుగుతున్న 'ఆక్వాకల్చర్ ఇన్నోవేషన్ టెక్ 2.0' కాంక్లేవ్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'ఆక్వా రంగం ద్వారా రైతులకు ఆదాయం, ప్రభుత్వానికి ఏటా రూ.1.30 లక్షల కోట్ల జీవీఏ అందుతున్నా.. కాలుష్యం వల్ల స్థానికంగా తాగడానికి నీరు పనికిరావట్లేదనే బాధ ఉంది. ఈ పరిస్థితి మారాలి. గ్రీన్ ఎనర్జీని అందిపుచ్చుకోవాలి. ఆక్వా ఫారాలు, పరిశ్రమల్లో పెద్దఎత్తున సౌర విద్యుత్తు ఉత్పత్తి చేయాలి' అని సూచించారు. 'ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో కొన్ని మాట్లాడలేకపోతున్నా. విద్యుత్తు ఛార్జీలు సహా.. ఆక్వారంగం విషయంలో త్వరలో కీలక నిర్ణయాలు తీసుకుంటాం. ఆక్వా రైతులకిస్తున్న రుణాలు రూ.3వేల కోట్లే. బ్యాంకులతో మాట్లాడి వీలైనంత ఎక్కువగా రుణాలు ఇప్పిస్తాం' అని తెలిపారు.

**ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ తప్పనిసరి**

'రాష్ట్రం నుంచి ఎగుమతి అయ్యే ఉత్పత్తేదీ ప్రపంచ మార్కెట్‌లో తిరస్కరణకు గురికాకూడదు. రైతులు సీడ్, ఫీడ్ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. యాంటీబయాటిక్స్‌ను పూర్తిగా నియంత్రించాలి. ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ విధానం అమలుచేయాలి' అని చంద్రబాబు సూచించారు. 'మొత్తం 60వేలమంది రైతులు ఉన్నారు. అందరూ సాగు నమోదు చేసుకోవాలి. అంతా అంగీకరిస్తే రెండు మూడు నెలల్లోనే జియోట్యాగింగ్ పూర్తిచేస్తాం. రక్షణ రంగంలో ఆక్వా ఉత్పత్తుల్ని ప్రోత్సహించడంపై రక్షణ మంత్రిని కోరుతాం. ఆక్వాల్యాబ్స్ ఏర్పాటుకు కృషిచేస్తాం. విశాఖపట్నంలో క్వారంటైన్ ఏర్పాటుపైనా దృష్టిపెడతాం. మార్కెట్ లింకేజి, స్థానిక మార్కెట్ కల్పిస్తాం' అని పేర్కొన్నారు.

**ఆహారమే మందు.. వంట గదే ఫార్మసీ**

'ప్రతి ఇంట్లో తినే ఆహారమే మందు... వంట గదే మందుల దుకాణం(ఫార్మసీ) కావాలి. అప్పుడు వైద్యుల వద్దకు పోవాల్సిన అవసరమే ఉండదు. అలాంటి ఆహారపు అలవాట్లపై అధ్యయనం చేస్తున్నాం' అని చంద్రబాబు చెప్పారు. మారుతున్న ప్రజల ఆహారపు అలవాట్లు, ప్రపంచ అవసరాలకు అనుగుణంగా మన రైతులు పంటలు పండించాలని ముఖ్యమంత్రి సూచించారు.
ఆక్వాటెక్ సదస్సులో జ్యోతి వెలిగిస్తున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు, తదితరులు
భాగస్వాముల్ని ఒకే వేదికపైకి తెచ్చిన జీఎస్ఎఫ్‌టీ
జీఎఫ్ఎస్‌టీ ఆధ్వర్యంలో ఆక్వా సదస్సు ఏర్పాటుచేసి భాగస్వాములందరినీ ఒక వేదికపైకి తెచ్చారని మాజీ సీఎస్ ఠక్కర్, కుటుంబరావు, సంజయ్‌గుప్తా, రామ్‌రాజ్‌లను చంద్రబాబు అభినందించారు.

**ఢిల్లీ కొత్త సీఎం ప్రమాణ స్వీకారోత్సవానికి చంద్రబాబు**

**మంత్రివర్గ సమావేశం వాయిదా**

ముఖ్యమంత్రి చంద్రబాబు నేటి(బుధవారం) సాయంత్రం ఢిల్లీ వెళ్లనున్నారు. ఢిల్లీ కొత్త ముఖ్యమంత్రి ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ తరఫున చంద్రబాబు ప్రచారం కూడా చేశారు. సీఎం ఢిల్లీ వెళుతుండటంతో ఈ నెల 20న జరగాల్సిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. చంద్రబాబు బుధవారం సాయంత్రం 4.55 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి ఢిల్లీ బయల్దేరి వెళతారు. ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో గురువారం సాయంత్రం జరిగే ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం 6.10 గంటలకు ఢిల్లీ నుంచి బయల్దేరి హైదరాబాద్ చేరుకుంటారు.

## మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు నడపండి

హైదరాబాద్ :మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని మంత్రి పొన్నం ప్రభాకర్ రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. ఈ నెల 26వ తేదీన మహాశివరాత్రి నేపథ్యంలో శివాలయాలకు భక్తులు భారీగా తరలివస్తారు. వేములవాడ, కీసర వంటి పుణ్యక్షేత్రాలకు పెద్ద ఎత్తున భక్తులు వస్తారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ రోజు హైదరాబాద్‌లోని తన నివాసంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు అధికంగా తరలి వచ్చే వేములవాడ, శ్రీశైలం, ఏడుపాయల, కీసర, పాలకుర్తి దేవాలయాలకు ప్రత్యేక బస్సులను నడపాలని ఆదేశించారు. బస్టాండ్‌ల వద్ద రద్దీ ఎక్కువగా ఉంటే అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ఢిల్లీ వెళ్లడం.. కేసీఆర్‌ని తిట్టడం తప్ప రేవంత్ పాలనలో ఏం లేదు

- మొదటి పేజి తరువాయి

రావడం సంతోషంగా ఉందన్నారు. తెలంగాణా ఏర్పడ్డాక సూర్యాపేట జిల్లాగా మారిందని.. కేసీఆర్ చొరవతో జిల్లాకు ప్రభుత్వ మెడికల్ కాలేజ్ వచ్చిందని అన్నారు. తెలంగాణ ఫలాలు ప్రజలకు అందాయనడానికి ఇవే రుజువు అన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో అభివృద్ధి కుంట పడిందని.. కనీసం మహిళల సంక్షేమం కోసం ఒక్కసారి కూడా రివ్యూ చేయలేదని అసహనం వ్యక్తం చేశారు. మహిళల అభివృద్ధి పై చర్చకు రావాలని కాంగ్రెస్ నేతలకు సవాల్ విసిరారు. ఆడబిడ్డలకు భద్రత కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని.. మహిళలపై 20 శాతం క్రైమ్ పెరిగిందని విమర్శించారు. రాష్ట్రంలో మతకల్లోలాలు కూడా బాగా పెరిగాయన్నారు. కొట్లాడి తెచ్చిన తెలంగాణను కాపాడుకునే పరిస్థితి లేదన్నారు. ఎస్సీల కోసం సీఎం రేవంత్ ఏం చేశారని ప్రశ్నించారు. కులగణతో గందరగోళం సృష్టించి జనాభా లెక్కలు తక్కువ చూపిస్తున్నారని ఫైర్ అయ్యారు. కాళేశ్వరం నీళ్ళు సూర్యాపేట జిల్లా వరకు తెచ్చామని.. ఇప్పుడు జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎందుకు నీళ్ళు ఇస్తలేరని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టమైన నీటి విధానం లేదని.. కాళేశ్వరం డ్యామ్ బాగానే ఉన్నా కావాలని నీళ్ళు ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీళ్ల లేక పంటలు ఎండుతున్నాయని.. రైతుల ఉసురు కాంగ్రెస్ కి తప్పక తాకుతుందన్నారు. జిల్లా మంత్రి ఉత్తమ్ కి సాగు నీరు అందించడంలో శ్రద్ధ లేదన్నారు. కేసీఆర్ ను తిడితే ఏమీ ఒరగదని.. ఇకనైనా ఆయనపై విమర్శలు చేయడం మాని సంక్షేమంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు.

## ఇంకా శివరాత్రే రాలేదు.. బాబోయ్.. ఇవేం ఎండలు!

- మొదటి పేజి తరువాయి

ఇళ్లలో కరెంటు పోతే ఉక్కబోత తప్పడం లేదు. వ్యవసాయ పనుల్లో వుండే రైతులపైనా ఈ ప్రభావం పడుతోంది. మధ్యాహ్నం 12 గంటల నుంచి మూడింటి దాకా విశ్రాంతి తీసుకొని, ఉదయం, సాయంత్రం వేళల్లో సాగు పనులు చేసుకుంటున్నారు. ఇక ఇప్పుడే ఎండలు ఇలా ఉంటే.. ఏప్రిల్‌లో, ఆపై మండు వేసవి అయిన మే నెలలో ఇంకేస్థాయిలో దంచికొడతాయోననే ఆందోళన వ్యక్తమవుతోంది. సోమవారం తెలంగాణలో 35.6 డిగ్రీల నుంచి 37.7 డిగ్రీల దాకా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కామారెడ్డి జిల్లా పిట్లంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 37.7 డిగ్రీలుగా రికార్డయింది. ఆదిలాబాద్, కొత్తగూడెం, గద్వాల, కరీంనగర్, ఖమ్మం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, వనపర్తి, సంగారెడ్డి, సిరిసిల్ల, నిర్మల్, పెద్దపల్లి, నారాయణ్‌పేట్, నల్లగొండ జిల్లాల్లో 37.6 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 1 నుంచి 2 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

## త్వరలో అందుబాటులోకి క్యాన్సర్ టీకా

మహిళలను ప్రభావితం చేస్తున్న క్యాన్సర్‌ను ఎదుర్కొనేందుకు మరో ఐదారు నెలల్లో టీకా అందుబాటులోకి రానుందని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ సహాయ మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ వెల్లడించారు. అయితే, ఈ టీకా వేసుకోవడానికి 9 నుండి 16 ఏళ్ల లోపు వయస్సు ఉన్న బాలికలు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ టీకాపై పరిశోధనలు పూర్తి కావొచ్చాయని, ట్రయల్స్ కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు.ఈ రోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో క్యాన్సర్ రోగుల సంఖ్య పెరుగుతోందని, ఈ సమస్యను పరిష్కరించడానికి కేంద్రం చర్యలు తీసుకుంటోందన్నారు. ముప్ఫై ఏళ్లు పైబడిన మహిళలకు ఆసుపత్రుల్లో స్క్రీనింగ్ నిర్వహిస్తారని తెలిపారు. వ్యాధిని గుర్తించేందుకు డే-కేర్ క్యాన్సర్ కేంద్రా లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే ఔషధాలపై కస్టమ్స్ డ్యూటీని రద్దు చేసినట్లు తెలిపారు. త్వరలో అందుబాటులోకి రానున్న ఈ టీకా రొమ్ము, నోటి, గర్భాశయ క్యాన్సర్లను నియంత్రిస్తుందని కేంద్రమంత్రి తెలిపారు.

## సీఎం చంద్రబాబు కృషి వల్లే అది సాధ్యమైంది

గుంటూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్రమంత్రి కింజ రాపు రామ్మోహన్ నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. సీఎం చంద్రబాబు కృషితోనే కేంద్ర బడ్జెట్ లో రాష్ట్రానికి కేటాయింపులు
పెరిగాయని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన తప్పులతో జల్‌జీవన్ మిషన్ లో రూ. 15వేల కోట్ల నష్టం వచ్చిందన్నారు. కానీ, చంద్రబాబు విజ్ఞప్తి మేరకు ఆ స్కీమ్ ను కేంద్రం మరో ఏడాది పొడిగించిందని చెప్పారు. గత సర్కార్ చేసిన తప్పులు ఇప్పుడు నిధుల సమీకరణకు అడ్డంకిగా మారాయని అన్నారు. అయితే, చంద్రబాబు కృషితో ఎన్నడూ లేని విధంగా గత ఏడు నెలల్లో ఏపీకి కేంద్రం సహకారం అందించిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ లో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం నడుస్తోందని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు అన్నారు.

## తిరుమల కల్తీ నెయ్యి వ్యవహారంలో నిందితులకు ముగిసిన సిట్ విచారణ

తిరుమల కల్తీ నెయ్యి కేసులో నిందితులకు సిట్ విచారణ నేటితో ముగిసింది. తిరుపతిలో సిట్ కార్యాయంలో ఐదు రోజుల పాటు ఈ విచారణ సాగింది. సిట్ అధికారులు కస్టడీలో వివిధ అంశాలపై సమాచారం రాబట్టారు. భోలే బాబా డెయిరీ మాజీ డైరెక్టర్లు విపిన్ జైన్, పోమిల్ జైన్, శ్రీ వైష్ణవి డెయిరీ సీఈవో అపూర్వ వినయ్ కాంత్
చావ్డా, ఏఆర్ డెయిరీ ఎండీ రాజశేఖరన్ లను సిట్ ప్రశ్నించింది. నలుగురు నిందితులకు తిరుపతి రుయా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కస్టడీ ముగిసిన అనంతరం నిందితులను పోలీసులు తిరుపతి రెండో అడిషనల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు.

## అష్టలక్ష్మి పీఠం పోస్టర్ ను ఆవిష్కరించిన ఎటపాక మండల అధికారులు.

- గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి.



**సీ కే న్యూస్ ఎటపాక ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 18,**అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం ఉష్ణ గుండాల సమీపంలో మార్చి 12 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీ అష్టలక్ష్మి యాగం పోస్టర్ ను ఎటపాక మండల తాసిల్దార్ కారం సుబ్బారావు, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, సర్కిల్ ఇన్స్పెక్టర్ కన్నప్ప రాజు, చేతుల మీదగా శ్రీ అష్టలక్ష్మి యాగం పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీ అష్టలక్ష్మి పీఠం వ్యవస్థాపకా చార్యులు శ్రీ పీతాంబరం రఘునాథ చార్యులు స్వామీజీ, మాట్లాడుతూ లోక కళ్యాణం కోసం నిర్వహించే ఈ బృహత్తరమైనటువంటి కార్యక్రమం లో పాల్గొని అష్టలక్ష్మి అమ్మవారి అనుగ్రహాన్ని పొందాలని మండల అధికారులకు ఇన్విటేషన్ను అందించి వారి చేతుల మీదగా పోస్టర్ను ఆవిష్కరించారు. అంతే కాకుండా ఆడవాళ్ళ కోసం సుమంగళి యాగం, కుంకుమార్చన, పిల్లల కోసం, హయగ్రీవ యాగం, మరియు వారికి ప్రతిమలు ఇవ్వడం జరుగుతుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ అష్టలక్ష్మి పీఠం వ్యవస్థాపక చార్యులు శ్రీ పీతాంబరం రఘునాథ ఆచార్యులు స్వామీజీ, మరియు గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి నక్కా భాస్కరరావు , ( రిటైర్డ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పంచాయతీరాజ్ ) తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పరివర్తన యశోదా ఫౌండేషన్ సేవా సమితికి ఆల్ పెన్షనర్స్ 25 కేజీల బియ్యం అందజేత.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 18,** భద్రాచలంలోని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ భద్రాచలం డివిజన్ కార్యాలయంలో భద్రాచలం డివిజన్ అధ్యక్షులు బందు వెంకటేశ్వర రావు. ప్రధాన కార్యదర్శి కె ఎస్ ఎల్ వి ప్రసాద్ కోశాధికారి కృష్ణమూర్తి జిల్లా గౌరవ అధ్యక్షులు ఎంవిఎస్ఎస్ నారాయణ. ఆధ్వర్యంలో పరివర్తన యశోదా ఫౌండేషన్ సేవా సమితి అధ్యక్షుడు కొమ్మ గిరి వెంకటేశ్వర్లుకి25 కే జి ల మంచి రకం బియ్యం ను అందజేశారు. ఎన్నో చీకటి బ్రతుకులను వెలుగులోకి తీసుకువచ్చేందుకు యశోదా ఫౌండేషన్ వారు చేస్తున్న ప్రయత్నానికి మా వంతు సహకారంగా అందించే ఈ చిరు సహాయం పేదల జీవితాలలో వెలుగులు నింపుతుందని ఆశిస్తూ మా మాలాగే ప్రతి ఒక్కరూ సహకరిద్దాం-సేవ చేద్దాం-అండగా ఉందాం అని అభిప్రాయపడుతూ ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి యశోదా ఫౌండేషన్కు సహకరిస్తారని ఆశిస్తున్నాం. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు. కె ఎస్ ఎల్ వి ప్రసాద్. డి కృష్ణమూర్తి ఎం వి ఎస్ ఎస్ నారాయణ. నాళం సత్యనారాయణ. సిహెచ్ సుబ్బయ్య చౌదరి .ఎస్ రాజబాబు. టి శివ ప్రసాద్. ఐలయ్య. విష్ణు మొలకల సుబ్రహ్మణ్యం. మాదిరెడ్డి రామ్మోహనరావు. చుక్కా రాంబాబు. బి రాజు. పరిటాల సుబ్బారావు. పంపన సత్యనారాయణ. తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసి గ్రామాల ప్రజలకు ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేయాలి.

- మౌలిక సదుపాయాలు కల్పించాలి.
- సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో అశ్వాపురం తహశీల్దార్ బి స్వర్ణ కి వినతి పత్రం అందజేత.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 18,**అశ్వాపురం మండల పరిధిలోని ఆదివాసి గ్రామాల ప్రజలకు ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేయాలి మౌలిక సదుపాయాలు కల్పించాలనీ కోరుతూ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో అశ్వాపురం తహశీల్దార్ బి స్వర్ణకి, ఎండిఓ కార్యాలయ సూపరిండెంట్ టీవీ ఆర్కే పిచ్చేశ్వరరావు కి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా న్యూ డెమోక్రసీ అనుబంధ ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ అశ్వాపురం మండల పరిధిలోని వలస ఆదివాసి గ్రామాలు కుమ్మరి గుంపు, కొత్త గుంపు, రాంనగర్, రాయన్నపేట, మనుబోతుల గూడెం, మావిళ్ళవాయి, మొండికుంట సమీప గ్రామాలలో నివసిస్తున్న అనేక మంది ఆదివాసీలు మరియు గిరిజనులకు ఆరోగ్యశ్రీ కార్డులు లేని కారణంగా ఏదైనా ప్రమాదం లేదా అనారోగ్యం పాలైన గిరిజనులు చాలా మెరుగైన వైద్యం చేయించుకోవాలంటే ఆరోగ్యశ్రీ కార్డు లేక చాలా ఇబ్బంది పడుతున్న పరిస్థితనీ దయచేసి మండల పరిధిలోని గ్రామాల గిరిజనులకు ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేయాలని కోరారు . అదేవిధంగా ఫిబ్రవరి నెలలోనే భానుడి ప్రతాపం చూపిస్తున్న నేపథ్యంలో నిండు వేసవిలో త్రాగునీటి సమస్యను కూడా ఎదుర్కోబోతున్నారన్నారు. మిషన్ భగీరథ పక్కనే ఉండి కూడా కుమ్మరి గుంపు, రాంనగర్ ఆదివాసి ప్రజలకు తాగునీటి అందుబాటు లేకపోవడం ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆదివాసి గిరిజన గ్రామాలకు త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని మౌలిక సదుపాయాలైన రోడ్లు,విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు.. ఈ కార్యక్రమంలో ఐ ఎఫ్ టి యు అనుబంధ గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి యస్ డి నా సర్ పాషా, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు పెద్దగోని ఆదిలక్ష్మి, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ అశ్వాపురం మండల నాయకులు పావురాల లాలయ్య, సామాజిక కార్యకర్త కుంజా నందు తదితరులు పాల్గొన్నారు.

# మిర్చి ధరపై కన్నెర్ర

- క్వింటాల్ రూ.25వేలకు కొనాలని డిమాండ్
- ఖమ్మం మార్కెట్‌లో సిపిఎం, ఏఐకేఎస్,తెలంగాణ రైతుసంఘం మహాధర్నా
- ఆహారపంటగా గుర్తించి మద్దతు ధరల జాబితాలో చేర్చాలి
- ధరల స్థిరీకరణ కోసం ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి..
- పంటలు, ఎరువులు, పురుగుమందులపై జీఎస్టీ రద్దుకు డిమాండ్
- ప్రధాని మోడీకి వ్యవసాయ రంగం గురించి పట్టదు..
- ముగ్గురు మంత్రులుండి ఏమి ఉపయోగం?
- తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని, రాష్ట్ర నాయకులు నున్నా



**సి కె న్యూస్ ప్రతినిధి** ఖమ్మం మిర్చి ధరలపై సీపీఐ(ఎం) కన్నెర్ర చేసింది. క్వింటాల్ మిర్చికి రూ.25వేల మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, ఏఐకేఎస్, తెలంగాణ రైతుసంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మహాధర్నా నిర్వహించింది. ఎర్రజెండాలు చేతపట్టి పెద్ద ఎత్తున రైతులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దీనిలో భాగంగా తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ క్వింటాల్ మిర్చికి రూ.25వేల మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిర్చిని వ్యాపార పంటగా కాకుండా ఆహారపంటగా గుర్తించాలని, ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేసి ధరల స్థిరీకరణకు చర్యలు చేపట్టాలని కోరారు. మార్క్‌ఫెడ్, నాఫెడ్‌ల ద్వారా రూ.25వేలకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. 2023లో ఇదే మార్కెట్లో క్వింటా మిర్చి రూ.25,500 పలుకగా ఇప్పుడు కేవలం రూ.11 వేల నుంచి 13వేలకే కొనుగోలు చేస్తుండటంపై మండిపడ్డారు. రాష్ట్రంలో సుమారు ఐదు లక్షల ఎకరాల్లో మిర్చి సాగైందని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1.25 లక్షల ఎకరాల్లో సాగు చేశారని, రాష్ట్రంలో ఈ ఏడాది 447 మంది రైతులు చనిపోయారని, జిల్లాలో మిర్చి కారణంగా నలుగురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. ఇంతమంది రైతులు చనిపోతున్నా మిర్చి ధరలపై రాష్ట్రప్రభుత్వం కేంద్రంతో ఎందుకు మాట్లాడట్లేదని ప్రశ్నించారు. ప్రధాని మోడీకి వ్యవసాయ రంగం గురించి పట్టదని, రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు, ఖమ్మం జిల్లాలో ముగ్గురు రాష్ట్రమంత్రులు ఉండి ఏమి ఉపయోగం అని ప్రశ్నించారు.

ధరల స్థిరీకరణకు ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలి...

వ్యాపార పంటగా చూస్తున్న మిర్చిని ఆహార పంటల జాబితాలో చేర్చాలని పోతినేని డిమాండ్ చేశారు. కారం లేకుండా కూర తినే పరిస్థితి ఉందా? అని ప్రశ్నించారు. అటు గుంటూరు ఇటు వరంగల్ మిర్చి మార్కెట్లకు మధ్యలో ఉన్న అతి పెద్ద మార్కెట్ ఖమ్మంలో ధరల స్థిరీకరణ కోసం మిర్చి బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. గతంలో వామపక్షాల భాగస్వామ్యంతో పనిచేసిన యూపీఏ ప్రభుత్వం మిర్చికి 10% కంటే ధర తగ్గినప్పుడు గిట్టుబాటు ధర కోసం చర్యలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అమెరికా పర్యటనలో రూ.500 కోట్ల డాలర్ల ఆయుధ హెలికాప్టర్ల కొనుగోళ్లపై ఆ దేశాధ్యక్షుడు ట్రంప్‌తో ఒప్పందం చేసుకున్న మోడీ...అమెరికా, చైనా, థాయ్‌లాండ్ తదితర దేశాలకు ఎక్కువగా ఎగుమతి అయ్యే తేజా, ఆర్మూర్ రకం మిర్చి గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. పంటలు, ఎరువులు, పురుగుమందులపై జీఎస్టీ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మిర్చి రైతులు పురుగుమందులపై రూ.50వేల పెట్టుబడి పెడితే 18% జీఎస్టీ పేరుతో రూ.9వేలు పన్ను కట్టాల్సి వస్తోందని వివరించారు. పంట అమ్మకాలపైనా జీఎస్టీ వసూలు చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. పంటలు, ఎరువులు, క్రిమిసంహారక మందులపై జీఎస్టీ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఎరువులపై 10-30% పన్నులు, డీజిల్, పెట్రోల్‌పై కమీషన్లు దండుకుంటున్న కేంద్రప్రభుత్వం మిర్చి పంట ధరను 60% తగ్గించటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పరమ దుర్మార్గంగా వ్యవహరించే ప్రభుత్వాలున్న తరుణంలో ఉద్యమించకపోతే రైతు సమస్యలు పరిష్కారం కావన్నారు. రైతులు పోరాటాలను నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు.

**స్పందించకపోతే మంత్రుల క్యాంప్ కార్యాలయాల ముట్టడి : నున్నా నాగేశ్వరరావు**

ఈ సీజన్‌లో ఇప్పటికీ రెండుసార్లు మిర్చి ధరల పెంపుపై ఆందోళనలు చేశాం...మిర్చి రైతులు మరణిస్తున్నారు.. ఇప్పటికీ జిల్లాలో నలుగురు ఆత్మహత్య చేసుకున్నారు.. ఇకనైనా స్పందించకపోతే మిర్చి రైతులతో మంత్రుల ఇళ్లు, క్యాంప్ కార్యాలయాలు ముట్టడిస్తామని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర నాయకులు, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు హెచ్చరించారు. వివిధ రకాల తెగుళ్లకు రైతు ఒక్కసారి పురుగుమందు కొడితే ఎకరానికి రూ.2వేలకు పైగా ఖర్చు వస్తుందని, అలాంటిది సీజన్‌కు 20 సార్లకు పైగా పిచికారీ చేయాల్సి వస్తోందన్నారు. పురుగుమందులపై రూ.లక్ష పెట్టుబడికి జీఎస్టీ కేంద్రానికి రూ.18వేలు చెల్లిస్తున్నామని తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేకులుగా ఉన్నాయన్నారు. ఖమ్మంలో మిర్చి బోర్డు ఏర్పాటుకు ఎంపీ రఘురాంరెడ్డి చొరవ తీసుకోవాలని కోరారు. మిర్చి ధర రూ.15వేలకు తగ్గకుండా చూస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి మిర్చి బోర్డు ఏర్పాటుకు కేంద్రంపై ఒత్తిడి తేవాలని తెలంగాణ రైతుసంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శి బంతు రాంబాబు కోరారు.

సుగంధద్రవ్యాల బోర్డు నుంచి విడదీసి మిర్చి బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర నాయకులు యర్రా శ్రీకాంత్, జిటల్లా అధ్యక్షులు మాదినేని రమేష్, నాయకులు భూక్యా వీరభద్రం, వై.విక్రమ్, యర్రా శ్రీనివాసరావు, కార్పొరేటర్ యల్లంపల్లి వెంకట్రావ్, రైతుసంఘం సీనియర్ నాయకులు తాతా భాస్కర్‌రావు, కొక్కెర పుల్లయ్య, పొన్నం వెంకటేశ్వరరావు, ఆయిల్‌పామ్ రైతుసంఘం నాయకులు మహేశ్వరరెడ్డి, రైతుసంఘం నాయకులు ఎస్.నవీన్‌రెడ్డి, తాళ్లపల్లి కృష్ణ, ఊరడి సుదర్శన్‌రెడ్డి, కొమ్ము శ్రీను తదితరులు పాల్గన్నారు.

## గ్రంథాలయ అధునాతన భవనం ఆకట్టుకునేలా ఉంది.



**- విశ్రాంత ఉద్యోగులుగా తమ వంతు సహకారం అందిస్తాం.**

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),ఫిబ్రవరి 18,** గ్రంథాలయం కోసం ఏర్పాటు చేసిన నూతన భవనం కార్పొరేట్ స్థాయిలో ఆకట్టుకునేలా ఉందని విద్యానగర్ కాలనీ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కొల్లు నాగేశ్వరరావు, కార్యదర్శి సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం నూతన గ్రంథాలయ భవనాన్ని సందర్శించిన వారు అందుబాటులోనికి తెచ్చిన సదుపాయాలు సౌకర్యాల పై స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వపరంగా కార్పొరేట్ స్థాయిలో చక్కటి వాతావరణం ఆహ్లాదకరమైన పరిస్థితుల నడుమ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ నూతన భవనం లోని ఏర్పాట్లను చూస్తుంటే ఇది నిజంగా ప్రభుత్వ కార్యాలయమైన అనే అనుమానాలు వ్యక్తం కాక మానవని చెప్పారు. ఇక్కడున్న సదుపాయాలను చూస్తుంటే వేరే రేంజ్ లో ఉన్నాయని, విద్యార్థులు కూర్చుని చదువుకునేందుకు అన్ని రకాల పుస్తకాలను అందుబాటులోకి తేవడం గమనార్హం అని చెప్పారు. గ్రంథ పాలకురాలుగా పనిచేస్తున్న మణి మృదుల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పోటీ పరీక్షలకు సిద్ధపడే వారికి అనునిత్యం అందుబాటులో ఉంటూ సహకారం అందిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ మధ్యకాలంలో గ్రంథాలయం పై ఆధారపడి చదివిన అనేకమంది ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం వెనుక గ్రంథ పాలకురాలి కృషి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుందని తెలిపారు. గతంలో మాదిరిగానే నూతన గ్రంథాలయానికి కూడా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని, పోటీ పరీక్షలకు సిద్ధపడే వారికి విశ్రాంత ఉద్యోగుల తరఫున సహకరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బి కేశవరావు, రాములు, శివరామకృష్ణ, గురుమూర్తి, సాంబయ్య, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ట్రైబల్ మ్యూజియం పనులు చివరి దశకు చేరుకున్నాయి.

**ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్.**

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 18,** ఐటీడీఏ ప్రాంగణంలో పర్యాటకుల కోసం సిద్ధం చేస్తున్న ట్రైబల్ మ్యూజియం పనులు చివరి దశకు చేరుకున్నాయని మార్చి నెలలో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. మంగళవారం మ్యూజియం కమిటీ సభ్యులతో కలిసి మ్యూజియంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. మ్యూజియం చుట్టూ డిజైన్ గా తయారుచేసిన చెట్లను ఖాళీగా ఉన్న ప్రదేశాలలో అమర్చాలని, మ్యూజియం ద్వారం నుండి మ్యూజియం వరకు వెదురుతో తయారుచేసిన దడికి లైట్ కలర్కు సంబంధించిన రంగులు అందంగా వేయించాలని, బాక్స్ క్రికెట్ కు సంబంధించిన పనులు ఈనెల 25 వరకు గ్రౌండ్ వర్క్ పూర్తి కావాలని, పది రోజులలో బాక్స్ క్రికెట్ గ్రౌండ్ పూర్తిస్థాయిలో నిర్మాణం జరగాలని అన్నారు. అలాగే మ్యూజియం సందర్శించడానికి వచ్చే సందర్శకుల కొరకు వివిధ రకాల తినుబండారాల కు సంబంధించిన స్టాల్స్ కొరకు ఏర్పాటు చేస్తున్న స్థలాన్ని వర్షాకాలంలో కూడా ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో గ్రావెలింగ్ చేయాలని డి ఈ కి ఆదేశించారు. ఇంకా ఏమైనా మిగిలిపోయిన పనులు ఉంటే త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని మ్యూజియం నిర్వహకులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఏటీడీఓ అశోక్ కుమార్, డీఎస్ఓ ప్రభాకర్ రావు, డి ఈ హరీష్, స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు, మ్యూజియం ఇంచార్జ్ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.



## సింగరేణి పాఠశాల విద్యార్థుల ప్రతిభ అభినందనీయం.

**సింగరేణి స్కూల్ కరస్పాండెంట్, డిజిఎం(పర్సనల్) రమేశ్.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 18,**ఇటీవల జరిగిన విద్యార్థుల సృజనాత్మకమైన అంశాలపై నిర్వహించబడిన ప్రతిభా పాటవాల పోటీలలో బహుమతులు పొందిన పివి కాలనీ సింగరేణి స్కూల్ విద్యార్థుల అభినందన కార్యక్రమం మంగళవారం నాడు సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాల, పి.వి కాలనీ నందు నిర్వహించ బడినది. ఈ నెల 15వ తేదీన తొలి అడుగు ఫౌండేషన్ వారు నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ పేయర్" లో మన పాఠశాల విద్యార్థులు ఎస్. ఇంతియాజ్ (ఇంక్ ఫ్రమ్ స్మోక్) అనే అంశానికి ప్రథమ స్థానం సాధించి రూ.4000/- నగదు బహుమతి మరియు షీల్డ్ గెలుచుకున్నాడు. అలాగే ఎస్. హంస నందిని (బయో డీగ్రేడబూల్ శానిటరీ ప్యాడ్) అనే అంశానికి జిల్లా స్థాయిలో తృతీయ స్థానం షీల్డ్ మరియు రూ.1000/- నగదు బహుమతి సాధించడం జరిగింది. ఈ సందర్భంగా బహుమతి పొందిన విద్యార్థులకు బహుమతి అందజేస్తూ పాఠశాల కరస్పాండెంట్, డిజిఎం (పరసనల్) ఎస్. రమేశ్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో వైజ్ఞానిక అంశాలలో సంపూర్ణ అవగాహన పెంచుకొని ఇదే విధంగా విజేతలుగా నిలుస్తూ సింగరేణి పాఠశాల కీర్తిని మరింతగా పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్స్ కే. మమతా, యూ. రజితలను అభినంధించారు. ఈ కార్యక్రమంలో ఎం.పి. మస్తానయ్య, ఆర్. కళ్యాణి, ఎం.వేణు, టి.వెంకన్న, ఎం. కృష్ణ బాబు తదితరులు పాల్గొన్నారు.

# 10వ తరగతి ఫలితాలు భవిష్యత్ లక్ష్యాలకు మార్గదర్శకాలు.

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),ఫిబ్రవరి 18,** 10వ తరగతి ఫలితాలు విద్యార్థుల భవిష్యత్తు యొక్క లక్ష్యాలు సాధించడానికి మార్గదర్శకాలు అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం పట్టణంలోని అంబేద్కర్ భవన్ షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ప్రేరణ మరియు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా తొలుత కలెక్టర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలనతో తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి ఫలితాల్లో ఎన్ని మార్కులు వస్తాయి అని విద్యార్థులు ఆలోచించకుండా వారి భవిష్యత్తు లక్ష్యాలను చేరుకోవడానికి కష్టపడి చదవాలని అన్నారు. కేవలం పదవ తరగతి మాత్రమే ప్రామాణికంగా తీసుకోరాదని, 10వ తరగతి అనేది ఒక మెట్టు మాత్రమే 10వ తరగతి తర్వాత అనేక కోర్సులు చేయాలని అన్నారు. నిరంతరం కష్టపడుతూ ఉంటే లక్ష్యాలను సాధించుకో వచ్చని అన్నారు. తాను కూడా విద్యార్థి దశలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నానని, పదవ తరగతి చదువుకునేటప్పుడు ఒక మంచి ఇంజనీర్ అవుదామని అనుకున్నాను, తర్వాత నా లక్ష్యాలను మార్చుకొని పట్టుదలతో చదివి ఐఏఎస్ సాధించానని తన అనుభవాన్ని విద్యార్థులతో కలెక్టర్ పంచుకున్నారు. విద్యార్థులు ఒక మంచి జీవితం కోసం ప్రేరణ కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాల లో ఉన్నతమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాటు అన్ని రకాల పుస్తకాలు మరియు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థుల కోసం ప్రత్యేక స్టడీ హావర్స్, ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను నియమించి నిపుణులతో ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్షలకు కొన్ని రోజులే సమయం ఉన్నందున సమయాన్ని వృధా చేయవద్దన్నారు. విద్యార్థులు టీవీ, ఫోన్, సోషల్ మీడియా లాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు సమన్వయంతో చదువుకోవాలన్నారు. వెనుకబడిన విద్యార్థులు పై ప్రత్యేక దృష్టి సాధించాలని, హాస్టల్లో విద్యార్థులను హాస్టల్ వార్డెన్లు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించి జిల్లాలో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా శిక్షణ అందించాలని కలెక్టర్ అన్నారు. అనంతరం విద్యాశాఖ రిసోర్స్ పర్సన్ లు సైదులు, నాగరాజు శేఖర్, నాగరాజు, విజయ భాస్కర్, శ్యాం చందర్ రావు లు విద్యార్థులకు శిక్షణ తరగతుల్లో వివిధ సబ్జెక్టుల్లో మెలకువలు నేర్పారు.

ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారిని అనసూర్య, ఏ ఎస్ డబ్ల్యూ ఓ లు హనుమంతరావు, సునీత, హెచ్ డబ్ల్యు ఓ లు గజ్వేల్ శ్రీనివాస్, పద్మావతి, శశిరేఖ, కౌసల్య,రామ నరసయ్య, స్వప్న, కార్యాలయ సిబ్బంది నరసింహారావు, పార్వతి శశికళ, హేమంత్ మరియు సాయి తదితరులు పాల్గొన్నారు.

# నుమాయిష్ లో సింగరేణి సేవా సమితి స్టాల్ కు ద్వితీయ బహుమతి.

- సీఎండీ ఎన్.బలరామ్ అభినందనలు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 18,** హైదరాబాద్ నాంపల్లిలో జరిగిన 84వ అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) లో సింగరేణి సేవా సమితి ఏర్పాటు చేసిన మహిళా శక్తి మార్కెట్. స్వయం ఉపాధి ఉత్పత్తుల స్టాల్కు ద్వితీయ బహుమతి లభించింది. నుమాయిష్ లో మొత్తం 2200కు పైగా స్టాల్స్ను ఏర్పాటు చేయగా.. ఇందులో ప్రభుత్వ విభాగంలో సింగరేణి సేవా సమితి స్టాల్కు బహుమతి లభించింది. సోమవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఎగ్జిబిషన్ సొసైటీ నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. స్టాల్ డెకరేషన్, వస్తు విక్రయాలు జరుగుతున్న తీరు, సందర్శకుల అభిప్రాయాలు తదితర అంశాలను పరిశీలించిన న్యాయ నిర్ణేతలు ఉత్తమ స్టాల్స్ను ఎంపిక చేసినట్లు సొసైటీ నిర్వాహకులు వెల్లడించారు. నుమాయిష్ లో ప్రదానం చేసిన బహుమతిని ఈడీ (మార్కెటింగ్), జీఎం(కో ఆర్డినేషన్), సింగరేణి సేవా సమితి ఉపాధ్యక్షులు ఎస్డి.ఎం.సుభానీ, పీఆర్వో , సేవా సమితి కో ఆర్డినేటింగ్ ఆఫీసర్ శ్రీకాంత్ లు సీఎండీ ఎన్. బలరామ్ అందజేశారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ... సింగరేణి స్టాల్కు బహుమతి ద్వారా గుర్తింపు రావడం అభినందనీయమన్నారు. సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాల్లోనూ మహిళల స్వయం ఉపాధి కోసం సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత శిక్షణలు అందజేస్తున్నామన్నారు. అలాగే స్వయంగా యూనిట్లు ఏర్పాటు చేసుకున్న మహిళల వస్తువులను విక్రయించేందుకు వీలుగా హైదరాబాద్ నుమాయిష్ లో ప్రతీ ఏటా స్టాల్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇదే కాకుండా ఉప్పల్ శిల్పారామం లోనూ సేవా సమితి స్టాల్ ద్వారా సేవా ఉత్పత్తులను విక్రయించేందుకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో నిరుద్యోగ యువతీ యువకులకు కూడా సంస్థ తరఫున వృత్తి శిక్షణలు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

45 రోజుల పాటు సాగిన నుమాయిష్ లో సింగరేణిని లోని 10 ఏరియాలకు చెందిన మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. దాదాపు 6 లక్షలకు పైగా విలువ చేసే క్లాత్ బ్యాగులు, జ్యూట్ బ్యాగ్లు, మగ్గంపై తయారీ చేసిన ఉత్పత్తులను విక్రయించారు. తమకు గత 20 ఏళ్లుగా నుమాయిష్ లో స్టాల్స్, హైదరాబాద్ లో వసతి ఏర్పాటు చేస్తున్న సింగరేణి యాజమాన్యానికి సేవా సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్మెల్సీ గా బిజెపి పార్టీ బలపరిచిన అభ్యర్థి శ్రీ పులి సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించాలి.

**బిజెపి పార్టీ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి కందుల తానేష్ గౌడ్.**



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఫిబ్రవరి 18.** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పరిధిలోని సంఘం గ్రామంలో జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి కందుల తానేష్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ, ఎమ్మెల్సీఅభ్యర్థిగా పోటీ చేస్తున్న శ్రీ పులి సర్వోత్తమ్ రెడ్డి కి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఆయన మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా నిరుద్యోగ భృతి 4000 రూపాయలు ఇస్తానని నిరుద్యోగుల ఓట్లను దండుకొని మోసం చేసిందని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని.

,నిరుద్యోగులను, ఉద్యోగస్తులను, మోసం చేసిన గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే పరిస్థితి లేకుండా కోల్పోయిందని, ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పట్టభద్రుల, టీచర్ల సమస్యలను పట్టించుకోకుండా గాలికి వదిలేసిందని మాట్లాడినారు,

# బిజెపి జిల్లా అధ్యక్షుని శాలువాతో సన్మానించిన వలిగొండ మండలం బిజెపి నాయకులు.



**సీకే న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఫిబ్రవరి 18.** భారతీయ జనతా పార్టీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం లో భాగంగా వలిగొండ మండలంలో వివిధ పాఠశాలల్లో సందర్శించి ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పులి సర్వోత్తమ్ రెడ్డి గారికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను అభ్యర్థించడం జరిగింది. అదేవిధంగా నూతనంగా జిల్లా అధ్యక్షుడిగా నియమించబడి తొలిసారి మండలానికి వచ్చినటువంటి జిల్లా అధ్యక్షులు.

ఉట్కూరి అశోక్ గౌడ్ ని మండల అధ్యక్షుడు బోల్ల సుదర్శన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా ఇన్చార్జి వట్టిపల్లి శ్రీనివాస్ గౌడ్ , సహ ఇంచార్జ్ చందా మహేందర్ గుప్తా , ఎమ్మెల్సీ ఎన్నికల మండల ఇన్చార్జి దంతూరి సత్తయ్య , జిల్లా నాయకులు కొప్పుల యాదిరెడ్డి , రాచకొండ కృష్ణ , కనతాల అశోక్ రెడ్డి , మంద నరసింహ , కందుల తానేష్ , బచ్చు శ్రీనివాస్ , మండల నాయకులు నాగెల్లి సుధాకర్ , లోడేలింగస్వామి గౌడ్ , దయ్యాల వెంకటేశం , వెంకటేశం , రామచంద్ర యాదవ్, పల్లెర్ల నరసింహ రాధారపుమల్లేశం , పోల్ నాగయ్య , నాగరాజు,రేగూరి అమరేందర్, మహేష్, రంజిత్, శివకుమార్, మచ్చ గిరి, వెంకటేశం, శివరంజన్, రమేష్, దానయ్య, మల్లేశం తదితర నాయకులు కార్యకర్త బంధువులు పాల్గొన్నారు.

# భద్రాచలంలోని షెడ్యూల్ కులాల బాలికల వసతి గృహంలోని ప్రహరీ గోడని పునః నిర్మించాలి.

**భద్రాచలం ఎం ఆర్ పి ఎస్ మండల అధ్యక్షుడు బొక్కా వినేష్ మాదిగ.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 18,** స్థానిక భద్రాచలంలోని షెడ్యూల్ కులాల బాలికల వసతి గృహం లోని ప్రహరీగోడ గడిచిన వేసవి కాలంలో పడిపోవడం జరిగిందనీ ఆ ప్రహరీ గోడకు ఆ నుకొని షెడ్యూల్ కులాల బాలుర వసతి గృహం ఉన్నదనీ దీనివల్ల బాలికలు చాలా ఇబ్బందులు పడుతున్నారనీ దానికి సంబంధించిన నిధులు కావాలని ఆ హాస్టల్ సంబంధిత ఇన్చార్జులు పై అధికారులకు పలుమార్లు దరఖాస్తు చేసుకున్న స్పందించడం లేదనీ ఎమ్మార్పీఎస్ ఎం ఎస్ పి దృష్టికి రావడంతో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నాయకులు ఆర్డిఓని కలిసి తక్షణమే ఆ ప్రహరీ గోడను పునః నిర్మించాలని మెమోరాండం తో తెలియజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు బొక్క వినేష్ మాదిగ, మహిళా మండల అధ్యక్షురాలు గుండె సుహాసిని మాదిగ ఆధ్వర్యంలో ఆర్డిఓ కి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసినఎం ఎస్ పి జిల్లా అధికార ప్రతినిధి తెల్లం సమ్మక్క మాట్లాడుతూ భద్రాచలం నడి బొడ్డున యసి గర్ల్స్ హాస్టల్ ప్రహరీ కూలిపోవడం వలన ఇక్కడ చదువుకుంటున్న ఆడపిల్లలు భయ భ్రాంతుల మధ్య చదువు కొనసాగిస్తున్నారని ప్రహరీ గోడ కూలి పోవడం వలన బాలికలకు రక్షణ లేకుండా పోయిందని ప్రహరీ కూలిపోయి సంవత్సరం కావస్తుందని ఇప్పటి వరకు నిర్మాణం చేయకపోవడం బాధాకరమని ఆమె ఆవేదన వ్యక్తపరిచారు. కూనవరం రోడ్డు నందు బీసీ ఎస్సీ ఎస్టీ హాస్టల్స్ డిగ్రీ జూనియర్ కాలేజ్ లు ఉన్నాయని నిత్యం విద్యార్థినీ విద్యార్థులు ఉండే ప్రాంతంలో మద్యం బెల్ట్ షాపులు సిగరెట్ పాన్ షాపులు విచ్చలవిడిగా నడిపిస్తున్నారని మద్యం సిగరెట్లు తాగి యువకులు మద్యం బాటిల్ ని పగలగొట్టి బీభత్సం సృష్టిస్తున్నారని బాలికలను అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఈ విషయాలన్నీ కూడా ఆర్డీవో కి వివరించామని ఆమె తెలిపారు. ఆర్డీవో స్పందించి తక్షణమే సంబంధిత అధికారులకు ఈ విషయాల పైన చర్యలు తీసుకునేందుకు తన వంతు కృషి చేస్తానని చుట్టూ ఉన్న మద్యం బెల్ట్ షాపులు సిగరెట్ పాన్ షాపులను ఎత్తివే వేషాల తక్షణమే చర్యలు చేపడతామని అలాగే మహిళల వసతి గృహం ప్రహరీ విషయాన్ని ఉన్నత అధికారులకు వివరించి ప్రహరి నిర్మాణం అయ్యేలా చర్యలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొక్క రాంబాబు మాదిగ మరియు బొక్క పున్నయ్య మాదిగ తదితరులు పాల్గొన్నారు

# న్యాయ చైతన్య సదస్సు.

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 18,**



డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, గొల్లపూడి భానుమతి మాట్లాడుతు, రైతులు విత్తనాలు మరియు పురుగు మందులు పురుగులు కొనుగోలు సమయంలో కచ్చితంగా లైసెన్స్ షాపులోనే తీసుకోవాలని, అలాగే విత్తనాలు కొన్న, పురుగు మందులు కొన్న కచ్చితంగా రసీదు తీసుకోవాలని వారు సూచించారు.ఆళ్ళపల్లి మండలం పెద వెంకటాపురం రైతుల అభ్యర్థన మేరకు, త్రీఫేస్ మోటార్ కరెంట్ లైన్, మరియు రోడ్డు, సంబంధిత విషయాలు అధికారుల ద్వారా, తక్షణమే న్యాయం జరిగేటట్లుగా చూస్తాము అని, అలాగే యువత మత్తు పదార్థాల కు బానిసలకు కాకుండా, సన్మార్గం వైపు నడవాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మరియు మోటార్ వెహికల్ లైసెన్సు ఉండాలి అని, అలాగే ఇన్సూరెన్స్ కూడా ఉండాలని, ఒకవేళ వారికి లేనట్లయితే, 50 నుంచి 100 మంది ఉన్నట్లయితే వారికి ఇన్సూరెన్స్ కంపెనీ పిలిచి ఇన్సూరెన్స్ కలిపిస్తామని, అలాగే ఆర్టీఏ వారిని పిలిచి లైసెన్స్ కూడా ఇప్పించడం జరుగుతుందని పేర్కొనడం జరిగింది. మారుమూల గ్రామాలలో జరిగే బాల్య వివాహాలు పద్ధతిని ప్రోత్సహించ కూడదని, అలా ఎవరైనా జరిపితే, వివాహము చేసిన వారిపైన, ఆవివాహాని కి హాజరైన వారి పైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, అలాగే బాల బాలికలను ఎవరైనా బాల కార్మికులగా పనిలో చేర్చుకుంటే, వారి పైన చట్టారీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు పేర్కొనడం జరిగింది. కార్యక్రమం అనంతరం ఆళ్లపల్లి మండలంలో ఉన్న వసతి గృహాలను తనిఖీ నిర్వహించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని హాస్టల్ వార్డెన్లను సూచించారు.ఈ యొక్క కార్యక్రమంలో, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, పి ఎల్ వి గుండె బోయిన రామకృష్ణ, వ్యవసాయ అధికారి, ఏవో, కే అనిల్ కుమార్, ఏ.ఈ.ఓ. రావూరి విజయ వంశీ,ఏఎస్ఐ వెంకట్ రెడ్డి,మండలంలోని ఆళ్లపల్లి, ఇప్పన పల్లి, పెద్ద వెంకటాపురం, రామానుజగూడం, మైలారం, పాతూరు, ఈ గ్రామ రైతులు మరియు గ్రామ పెద్దలు యువకులు, గోగ్గెల లక్ష్మయ్య, జార రాజేందర్,ఈసం వెంకయ్య, కుంట వెంకట రాములు, గౌరబోయిన సుబ్బారావు, నాగపాణి, కండె రామ్మూర్తి, గాద రాజు, చెన్నయ్య, సందీప్, మహేష్, రవి,నవీన్, చందు,ప్రదీప్, శ్రీను, శేఖర్, తదితర గ్రామ పెద్దలు రైతులు, మరియు యువకులు, విద్యార్థిని విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి

- మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థిని చదువు కోసం 23 వేలు ఆర్థిక సాయం.
- ప్రముఖ క్రిటికల్ కేర్ వైద్యులు డాక్టర్. అక్కినేని లోకేష్



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్ ),ఫిబ్రవరి 18,** భద్రాచలం పట్టణం ఆదర్శనగర్ కాలనీకి చెందిన పేద విద్యార్థిని గుండిపూడి ఛార్మిల భద్రాచల పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కళాశాలలో బైపిసి మొదటి సంవత్సరం చదువుతుంది. బాగా చదువుకోవాలన్న ఆకాంక్ష తపన ఉన్నా కూడా ఆర్థిక పరిస్థితి బాగోలేక చదువు కష్టంగా మారింది. గత కొంతకాలంగా తల్లిదండ్రుల యొక్క ఆరోగ్యం బాగోలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతుండటంతో విద్యార్థి యొక్క చదువు కష్టంగా మారడంతో పేద విద్యార్థి చదువు కోసం మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ సురక్ష హాస్పిటల్ డైరెక్టర్ ప్రముఖ క్రిటికల్ వైద్య నిపుణులు డాక్టర్ అక్కినేని లోకేష్ గారి చేతుల మీదుగా పేద విద్యార్థినికి 23 వేల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అక్కినేని లోకేష్ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్న పేద విద్యార్థినికి నేనున్నానంటూ ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించిన ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. అలాగే విద్యార్థిని ఉద్దేశించి మాట్లాడుతూ ఇష్టంతో కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నతమైన స్థాయిలో ఉండాలని కోరారు. ప్రశాంతత వాతావరణంలో ఎగ్జామ్స్ మంచిగా రాయాలని కోరారు. అలాగే ఆర్థిక సహాయం అందించిన ఎస్ ఎల్ బి టి పెయింట్స్ యజమానులు సెట్టి. వేణు రాజ్, వి వి . సూర్య తేజ , అబ్దుల్ ఊఫర్ లను , ట్రస్ట్ సభ్యులను అభినందించారు. అనంతరం ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల. మురళి మాట్లాడుతూ పేద విద్యార్థినికి చదువుకోవాలని తపన ఆకాంక్ష ఉండి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పరిస్థితి మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ దృష్టికి రావడంతో వెంటనే స్పందించి ట్రస్ట్ సభ్యులు 8000 రూపాయలు ఎస్ ఎల్ బి టి పెయింట్స్ 10000 రూపాయలు శ్రీ సురక్ష హాస్పిటల్. డాక్టర్ అక్కినేని లోకేష్ డాక్టర్ సూరపనేని. శ్రీ క్రాంతి లు 5000 రూపాయల సహకారంతో పేద విద్యార్థినికి 23 వేల రూపాయలు మొదటి సంవత్సరం చదువు కోసం అందజేశామని తెలిపారు. పేద విద్యార్థిని చదువు కోసం అడగగానే స్పందించి ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించిన డాక్టర్స్ కి , అలాగె ఎస్ ఎల్ బి టి పెయింట్స్, ట్రస్ట్ సభ్యులకు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థిని బాగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరారు. చదువుకు పేదరికం అడ్డు కాదని అన్నారు.ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆ లక్ష్యం కోసం నిరంతరం కృషి చేస్తే విజయం సొంతం అవుతుందని అన్నారు. భవిష్యత్తులో డాక్టర్ అవ్వాలనే లక్ష్యంతో బాగా చదివి వైద్య విద్యలో రాణించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు చోళ ఇన్సూరెన్స్ మేనేజర్ బాలరాజు, సాయికుమార్, కోమటిరెడ్డి చైతన్య, నాగరాజు బూరం నవీన్ , ఎడ్విన్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు

## కొత్తగూడెం ఏరియాలోని జే.వి.ఆర్ సిహెచ్‌పిని తనిఖీ చేసిన డైరెక్టర్ కే. వెంకటేశ్వర్లు.



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 18,** నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన డైరెక్టర్ (ప్రాజెక్ట్, ప్లానింగ్) కే. వెంకటేశ్వర్లు కొత్తగూడెం ఏరియా లోని జే.వి.ఆర్ సి హెచ్ పిని తనిఖీ చేశారు. డైరెక్టర్ (ప్రాజెక్ట్ మరియు ప్లానింగ్) జే.వి.ఆర్ సిహెచ్‌పి తనిఖీ చేసి, సిహెచ్‌పి నందు ఉత్పత్తి అయిన బొగ్గు రవాణా పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. మరియు కోల్ రిసీవింగ్ కాంప్లెక్స్ వద్ద బొగ్గు అన్లోడింగ్ చేయనప్పుడు వచ్చు సమస్యలను గూర్చి క్లుప్తంగా సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రైమరీ కోల్ క్రచర్ ఏరియాను తనిఖీ చేశారు. మరియు జె.వి.ఆర్ సిహెచ్‌పి లోని డిశ్చార్జ్ పాయింట్ల ను తనిఖీ చేసి అక్కడనుండి వచ్చును దుమ్ము ధూళినీ ఎలా అరికట్టా లో సంబంధిత అధికారులకు సూచనలు ఇచ్చారు. ఇన్స్పెక్షన్ అయిన తర్వాత సంబంధిత అధికారులతో అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ లో మీటింగ్ కండక్ట్ చేసి సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా జిఎం షాలెం రాజు, జి ఎం (సివిల్) టి. సూర్య నారాయణ, ఎస్ఓటు జిఎం జీవి కోటిరెడ్డి, ఏజీఎం (సివిల్) సిహెచ్.రామకృష్ణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ జే. వి ఆర్ ఓ సి ఎన్విఆర్ ప్రహ్లాద్, కిష్టారం ఓసి ఎం.వి. నరసింహారావు, జెవిఆర్ సి. హెచ్.పి ఇంచార్జ్ కే.సోమశేఖర్ మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పట్టబద్రుల ప్రయోజనాలు కాపాడే వ్యక్తి రాజశేఖర్..

- పట్టభద్రులంతా రాజశేఖర్ కు మద్దతుగా నిలవాలి..
- ఎటపాకలో విస్తృత ప్రచారం.



**సీ కే న్యూస్ ఎటపాక ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 18,** పట్ట భద్రులంతా తమ ప్రాధాన్యత ఓటు తో పేరబత్తుల .రాజశేఖర్ కి మద్దతుగా నిలిచి గెలిపించాలని పట్టభద్రుల ఓటర్లను అభ్యర్థించారు.

సీనియర్ నాయకులు పార్టీ చలపతిరావు రంపచోడవరం ఎమ్మెల్సీ ఎన్నికల ఏసి బాచినేని శ్రీకాంత్ తెలుగు యువత నాయకులు పార్టీ సంపత్ ,వార్డు మెంబర్ అలవాల.వెంకటరావు, మాజీ జెడ్పిటిసి గోడేటి రవికుమార్ మాజీ ఎంపీటీసీ సరిహద్దు వెంకన్న, దాడి రామకృష్ణ పాలడుగు నవీన్ దుద్దుకూరు రాము సద్దెనపు సత్యనారాయణ దాడి శ్రీనివాసరావు,టిడిపి శ్రేణులతో పట్టభద్రుల ఇండ్లకు వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిరుద్యోగ సమస్యల పట్ల అవగాహన ఉన్న వ్యక్తి రాజశేఖర్ అని, ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే పట్టబద్రుల ప్రయోజనాలు కాపాడుతారని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తారని అన్నారు. ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక శాతం ఓట్లతో గెలిపించాలని కోరారు.

## ఆర్థిక సహాయం అందజేత.



**సి కె న్యూస్ వలిగొండ మండలం ప్రతినిధి బాలరాజు ఫిబ్రవరి 18.** (మరణించిన కుటుంబానికి స్టేట్ బిజెపి కౌన్సిల్ మెంబర్ సిఎన్ రెడ్డి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందజేసినారు ) మంగళవారం రోజున నిమ్మల నరసింహ కుమారుడు శేఖర్ మరణించడం జరిగింది వారి కుటుంబాన్ని పరామర్శించి 5000 రూపాయలు సీఎన్ రెడ్డి సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరూరు గ్రామ మచ్చ కార్మిక సంఘం అధ్యక్షులు నిమ్మల రవి మచ్చ గిరి గుట్ట ధర్మకర్త బండి రవికుమార్ బిజెపి గ్రామ శాఖ అధ్యక్షుడు ఆవుల బిక్షం నిమ్మల భిక్షం నిమ్మల సామి తదితరులు పాల్గొన్నారు.

## వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా కార్యచరణ రూపొందించాలి.

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి.**



**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 18,** రానున్న వేసవిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా కార్యచరణ రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి ఇతర ముఖ్య కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులతో సాగునీరు, త్రాగునీరు, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం కలగకుండా విద్యుత్ సరఫరా, రైతు భరోసా, రబీ సీజన్ కు సాగునీటి సరఫరా, యూరియా కొరత, రేషన్ కార్డుల జారీ, రెసిడెన్షియల్ పాఠశాలల సందర్శన అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ వచ్చే వేసవికాలం దృష్ట్యా ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా కార్యచరణ రూపొందించి నిరంతరం నీటిని అందించే విధంగా ప్రణాళిక బద్ధంగా అమలు చేయాలని తెలిపారు. రబీ సీజన్ కొరకు సాగునీటి సమస్య లేకుండా ప్రాజెక్టులు, చెరువులపై సమీక్షించి ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ సాగులో రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని, ఈ నేపథ్యంలో యూరియా కొరత లేకుండా చూడాలని తెలిపారు. వేసవికాలం లో వ్యవసాయానికి, త్రాగు నీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. అర్హత గల ప్రతి రైతుకు రైతు భరోసా అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజాపాలన లో రేషన్ కార్డుల కొరకు వచ్చిన దరఖాస్తుల లో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు జారీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గురుకుల పాఠశాలలను జిల్లా అధికారులు సందర్శించి పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు.

ఐ డి ఓ సి కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన జడ్పీ సీఈవో నాగలక్ష్మి మరియు జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ రంగానికి, త్రాగునీటికి, నిర్మాణ రంగానికి విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, జిల్లాలో విద్యుత్ వినియోగంపై అధికారులతో సమీక్షిస్తూ అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రైతు భరోసా పథకం క్రింద అర్హులైన అందరికీ పథకం అందించే విధంగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు చేపడుతున్నామని, రేషన్ కార్డుల కొరకు ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రక్రియ పూర్తి చేసి శాసనమండలి సభ్యుల ఎన్నికల ప్రవర్తన నియమావళి ముగిసిన వెంటనే అర్హులైన వారందరికీ అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వేసవిలో ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా జిల్లాలోని మారుమూల ప్రాంతాల వరకు నీటిని అందించేందుకు అధికారుల సమన్వయంతో కార్యచరణ రూపొందిస్తున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, మిషన్ భగీరథ ఈ ఈ లు తిరుమలేష్, నలిని,జిల్లా విద్యుత్ శాఖ అధికారి జి. మహేందర్ , నీటి పారుదల శాఖ ఈ ఈ రాంప్రసాద్, పౌర సరఫరాల శాఖల అధికారులు త్రినాథ్ బాబు, రుక్మిణి, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన స్వామి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికుల సీఎం పిఎఫ్ ను వెంటనే అప్డేట్ చేయాలి.




**ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా.**

**సీ కే న్యూస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ( సాయి కౌశిక్),ఫిబ్రవరి 18,** సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల సీఎంపిఎఫ్ ను 2024 సంవత్సరం మార్చి వరకు అప్డేట్ చేసి కాంట్రాక్ట్ కార్మికులందరికీ పాసు బుక్కులను ఇవ్వాలని, సీఎంపిఎఫ్ ను ఆన్లైన్ చేయాలని,సీఎం పీఎఫ్ లో కాంట్రాక్ట్ కార్మికులకు లోన్ సౌకర్యం కల్పించాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్-ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు సిఎంపీఎఫ్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు.మంగళవారం కొత్తగూడెం సీఎం పిఎఫ్ రీజియన్ కార్యాలయం వద్ద సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి రీజినల్ కమిషనర్ ఎం కనకమ్మ కి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఏఐటియుసి కొత్తగూడెం రీజియన్ కార్యదర్శి యర్రగాని కృష్ణయ్య, ఉపాధ్యక్షులు కేడబ్ల్యూ కిష్టాఫర్ లు ఈ ధర్నా ఉద్దేశించి మాట్లాడుతూ సింగరేణిలో ప్రతినెల కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల నుండి సీఎం పిఎఫ్ కు డబ్బులు కట్ అవుతున్నప్పటి కీ ఎప్పటికప్పుడు వాటి వివరాలను కాంట్రాక్ట్ కార్మికులకు తెలియజేయడం లో సీఎం పీఎఫ్ సంస్థ వారు మరియు సింగరేణి అధికారులు వైఫల్యం చెందుతున్నారని విమర్శించారు. గత రెండు సంవత్సరాల నుండి సీఎం పిఎఫ్ వడ్డీ లెక్కలతో సహా ఎందుకు అప్డేట్ చేయడం లేదని ప్రశ్నించారు. తక్షణమే కాంట్రాక్ట్ కార్మికులందరికీ సీఎం పిఎఫ్ డబ్బులను ఖాతాబుక్కులలో అప్డేట్ చేసి వివరాలు తెలపాలని డిమాండ్ చేశారు.కాంట్రాక్ట్ కార్మికులకు సీఎం పీఎఫ్ లో పర్మినెంట్ కార్మికుల మాదిరిగా లోన్ సౌకర్యం కల్పించాలని కోరారు. దిగిపోయిన కాంట్రాక్ట్ కార్మికులకు పెన్షన్ జాప్యం కాకుండా వచ్చేటట్లుగా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎం చంద్రశేఖర్,సురేష్, సంజీవరావు, రమణ, వినోద్, ఏసు, వెంకటలక్ష్మి, వాసవి, శ్రీను, నిర్మల, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధులు హాజరు కాని ఉద్యోగులకు ‘షో కాజ్ నోటీసులు’ అందజేసి సస్పెండ్ చేయాలని కలెక్టర్ కు ఆదేశం.

- సాధారణ ఎన్నికల కంటే ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రత్యేకం.
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు, అభ్యర్థులు ఉన్నత విద్యావంతులు.
- అభ్యర్థులు ఎన్నికల నిబంధనలు నిబంధనలపై అవగాహన కలిగి ఉంటారు.
- ఎన్నికల సిబ్బంది అత్యంత జాగ్రత్తగా ఎన్నికల విధులు నిర్వర్తించాలి.
- ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవు.
- ఎమ్మెల్సీ ఎన్నికలను అధికారులు సిబ్బంది ఛాలెంజ్గా తీసుకొని నిర్వర్తించాలి.
- మెదక్ నిజామాబాద్ అదిలాబాద్ , కామారెడ్డి టీచర్స్ ఎన్నికల అబ్జర్వర్ బి. మహేష్ దత్ ఏక్కా, ఐఏఎస్.



**సంగారెడ్డి జిల్లా, బ్యూరో చీఫ్, సీ కే న్యూస్** సాధారణ ఎన్నికలకు ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ టీచర్స్ ఎన్నికలకు ఎంతో తేడా ఉంటుందని నిజామాబాద్ అదిలాబాద్ మెదక్ కామారెడ్డి జిల్లాల టీచర్స్ ఎన్నికల అబ్జర్వర్ మహేష్ దత్ ఏక్కా, ఐఏఎస్. అన్నారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లాలోని ఎమ్మెల్సీ ఎన్నికల నోడల్ అధికారులు, ఏ ఆర్ ఓ అధికారులతో ఎన్నికల విధులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అంతకు ముందు తారా డిగ్రీ కళాశాలలోని పోలింగ్ కేంద్రాన్ని, అంబేద్కర్ స్టేడియంలోని డిఆర్సి సెంటర్ ను జిల్లా కలెక్టర్ కాంతి వల్లూరు తో కలిసి పరిశీలించారు. సమీక్ష సమావేశం సందర్భంగా అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. సాధారణ ఎన్నికలకు ఎమ్మెల్సీ ఎన్నికలకు ప్రత్యేకత ఉంటుందన్నారు. ప్రతిసారి జరుగుతున్న ఎన్నికల్లో ఏదో ఒక ప్రత్యేకత ఉంటుందని అన్నారు. ఎస్ పి టి, ఎస్ ఎస్ టి, ఎస్ ఓ టి, ఎన్సిసి టీం ల ఏర్పాటు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్ ఎస్ టి, ఎఫ్ ఎస్ టి, సర్వే లైన్స్ టీమ్ ఏర్పాటు పనితీరు వివరాలను కలెక్టర్ వల్లూరు క్రాంతి అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల విధులు హాజరు కాని ఉద్యోగులకు షో కాజ్ నోటీసులు అందజేసి సస్పెండ్ చేయాలని కలెక్టర్ ను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఎన్నికల కు సంబంధించి మొదటి, రెండవ రాండమైజేషన్ పూర్తి చేయడం జరిగిందని , మూడవ రాండమైజేషన్ కూడా షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు అభ్యర్థులు ఉన్నత విద్యావంతులని ఎన్నికల విధులను సాధారణ ఎన్నికల్లో కాకుండా ఇప్పుడు లేదు జాగ్రత్త వ్యవహరించాలని ఎన్నికల నిర్వహణను చాలెంజింగ్ గా తీసుకొని పకడ్బందీగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. సందర్భంగా కలెక్టర్ వల్లూరు క్రాంతి జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ సజావుగా జరిగేలా అన్ని రకాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాధురి, అదనపు ఎస్పీ సంజీవ్ రావు, ట్రైనీ కలెక్టర్ మనోజ్, జిల్లాలోని నోడల్ అధికారులు, ఆర్ ఓలు, తహసీల్దార్ లు, ఎన్నికల విభాగ అధికారులు, సంబంబధిత అధికారులు, పాల్గొన్నారు.

## హామీల అమలు కోసం క్యాలెండర్

ఆంధ్రప్రదేశ్ లో టీడీపీ కూటమి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు సిద్ధమవుతుంది. వరసగా హామీలను అమలు చేయాలని నిర్ణయించింది. వచ్చే నెల నుంచి ఇక సూపర్ సిక్స్ హామీల అమలు నెలకొకటి అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. ఎన్నికల వేళ హామీ ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల్లో కొంత అసంతృప్తి పెరిగింది. కేవలం రాజధాని నిర్మాణాలకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారని, తమ గోడును పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. స్థానిక నేతల వద్ద కూడా ప్రజలు ఇదేరకమైన అభిప్రాయాన్ని వెళ్ల గక్కుతుండటంతో ఇక వరసగా హామీలు అమలు చేయాలని నిర్ణయించారు.ముందుగా మార్చి నెల నుంచి అంటే ఉగాది నాటి నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేయనున్నారు. దీనికి సంబంధించి విధివిధానాలను రూపొందించాలని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. అదే సమయంలో ఇతర రాష్ట్రాల్లో అనుసరించే పద్ధతులను అధ్యయనం చేసి వచ్చిన మంత్రుల కమిటీ కూడా ప్రభుత్వానికి నివేదిక అందించింది. అయితే జిల్లాల వరకే ఉచిత బస్సు ప్రయాణాన్ని పరిమితం చేస్తే పెద్దగా భారం పడదని నివేదికలో పేర్కొనడంతో ఆ దిశగా అమలు చేయాలని నిర్ణయించారు. ఉగాది రోజు చంద్రబాబు నాయుడు ఈ పథకాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. ఒక కుటుంబంలో ఎంత మంది పిల్లలు విద్యను అభ్యసిస్తున్నా వారికి ఏడాదికి పదిహేను వేల రూపాయలు చెల్లించాలని నిర్ణయించారు. ఏప్రిల్ నెల నుంచి ఈ పథకం మొదలయ్యే అవకాశాలున్నాయి. అయితే లబ్దిదారుల ఎంపిక ఏ విధంగా ఉండాలన్న దానిపై కూడా ఇప్పటికే క్లారిటీకి వచ్చారు. ఆధార్ కార్డుతో పాటు తెలుపు రంగు రేషన్ కార్డు ఉన్న వారికి ఈ పథకం అమలు చేయనున్నారని తెలిసింది. ఇప్పటికే దీనికి సంబంధించిన లబ్దిదారుల జాబితాను తయారు చేసే పనిలో అధికారులు ఉన్నారు. ఎంత మంది ఉన్నా అందరికీ ఇస్తామని చెప్పడంతో అది మరింత భారం కాకుండా కొన్ని నిబంధనలు రూపొందించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.. ఈ పథకం కింద ఏడాదికి ఇరవై వేల రూపాయలు ఇస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కూటమి పార్టీల మ్యానిఫెస్టోలో కూడా పెట్టారు. అయితే కేంద్ర ప్రభుత్వం తరహాలోనే మూడు విడతలుగా నగదును రైతుల ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. తొలి విడత నిధులను మే నెలలో ఇచ్చేందుకు అవసరమయిన నిధులను సిద్ధంచేయాలని అధికారులను చంద్రబాబు ఆదేశించినట్లు సమాచారం. దీంతో వరసగా మార్చి, ఏప్రిల్ మే నెలల్లో తాము ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమవుతుంది. బడ్జెట్ లో కూడా వీటికి నిధులు కేటాయించే అవకాశాలున్నాయి.

## క్లీన్ ఎనర్జీ హబ్ గా ఆంధ్ర

ఏపీని గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మార్చేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అందులో భాగంగానే ఇప్పటికే గ్రీన్ పాలసీని తీసుకువచ్చారు. దీంతో గ్రీన్ ఎనర్జీ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు పలు సంస్థలు ఆసక్తిని చూపుతున్నాయి. మరోవైపు కాకినాడలో ఏఎం గ్రీన్ ఎనర్జీ సంస్థ.. ఇంటిగ్రేటెడ్ గ్రీన్ అమ్మోనియా కాంప్లెక్స్ నిర్మాణానికి సంకల్పించింది. కాకినాడలో రూ.12000 కోట్లతో ఇంటిగ్రేటెడ్ గ్రీన్ అమ్మోనియా కాంప్లెక్స్ నిర్మాణం చేపడుతున్నారు. తాజాగా నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో కేంద్రం నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకోవడానికి ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుందని అధికారులు భావిస్తున్నారు. కాకినాడ గ్రీన్ అమ్మోనియా కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి అయితే ఏడాదికి ఒక మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తి అవుతుందని అంచనా.మరోవైపు కాకినాడలో ఏఎం గ్రీన్ అమ్మోనియా ప్రైవేట్ లిమిటెడ్ .. గ్రీన్ అమ్మోనియా ప్లాంట్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆమోదం తెలిపింది. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 కింద దీనికి ఆమోదం తెలిపింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఇప్పటికే జీవో కూడా జారీ చేశారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 కింద ఈ ప్రాజెక్టుకు అనేక ప్రోత్సాహకాలు కూడా ప్రభుత్వం ఇవ్వనుంది. ఎస్‌జీఎస్టీ రెవెన్యూలో వంద శాతం రీయింబర్స్‌మెంట్ ఇవ్వనున్నట్లు తెలిసింది. అయితే రాష్ట్రం పరిధిలో జరిపే గ్రీన్ అమ్మోనియా విక్రయాలకు మాత్రమే దీనిని ఐదేళ్ల పాటు అమలు చేయనున్నట్లు తెలిసింది.మరోవైపు క్లీన్ ఎనర్జీ రంగానికి సంబంధించి ఏపీలో పలు ప్రాజెక్టులు నడుస్తున్నాయి. లక్షా 85 వేల కోట్ల పెట్టుబడితో అనకాపల్లి జిల్లా పూడిమడకలో ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేశారు. ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ 1,200 ఎకరాల్లో ఏర్పాటు చేయనున్నారు .ఈ హబ్ ద్వారా 57 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు దక్కనున్నాయి. అలాగే ఈ ప్లాంట్ నుంచి 2028 నాటికల్లా గ్రీన్ హైడ్రోజన్ విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాలనేది అధికారుల ఆలోచన. మొత్తంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఏపీని గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ ఎనర్జీ రంగాలకు కేరాఫ్ అడ్రస్‌గా మార్చాలనే ప్రయత్నాల్లో ఉన్నాయి

## నాన్ వెజ్ ప్రియులకు కష్టాలు

తెలుగు రాష్ట్రాలలో ఇప్పుడు కొత్త జబ్బుల భయం పట్టుకుంది. ఓ వైపు గులియన్ బారే సిండ్రోమ్ భయాలు. మరోవైపు బర్డ్ ఫ్లూ వైరస్. అయితే బర్డ్ ఫ్లూ వైరస్ అనేది మనషులకు సోకకపోయినా.. ఈ వైరస్ కారణంగా లక్షల సంఖ్యలో కోళ్లు చనిపోవటం కలకలం రేపుతోంది. దీంతో చికెన్ వైపు చూడటానికి జనం ఆలోచిస్తున్నారు. ఆదివారం వస్తే ప్రత్యామ్నాయ మార్గాల వైపు దృష్టి సారిస్తున్నారు. దీంతో మటన్, చేపల మార్కెట్ల వద్ద రద్దీ పెరిగింది. దీనికి తోడు డిమాండ్ పెరగటంతో వారు కూడా రేట్లు పెంచారు. అయితే చికెన్ పోతే పోయింది.. చేపలు అయినా తిందామనుకుంటే ఇప్పుడు మరో టెన్షన్ మొదలైంది. బర్డ్ ఫ్లూ వైరస్ సోకి చనిపోయిన కోళ్లను అక్కడక్కడా చేపలకు ఆహారంగా వేస్తున్నారంటూ ప్రచారం జరుగుతోంది.ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే బర్డ్ ఫ్లూ వైరస్ ఉభయ గోదావరి జిల్లాల్లో కనిపించింది. అయితే ఈ జిల్లాల్లోని చేపలకు ఆహారంగా బర్డ్ ఫ్లూ వైరస్‌తో చనిపోయిన కోళ్లను ఆహారంగా వేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. కొన్ని ప్రాంతాల్లోని చేపల చెరువుల వద్ద కోళ్ల అవశేషాలు కనిపించడం కూడా ఈ ప్రచారాలకు బలం పెంచుతోంది. తూర్పుగోదావరి జిల్లాలోని కొన్ని మండలాల్లో బర్డ్ ఫ్లూ వైరస్‌తో చనిపోయిన కోళ్లను చేపలకు ఆహారంగా వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇందుకోసం చనిపోయిన కోళ్లను మగ్గబెట్టి మరీ చేపలకు ఆహారం తయారు చేస్తున్నారని ఇక్కడి జనం చెప్తున్నారు. నిషేధించిన క్యాట్ ఫిష్ ఇతరత్రా చేపల చెరువుల్లో కూడా వీటి వినియోగం పెరిగిందంటున్నారు.అయితే బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాప్తి భయాలతో ఇప్పటికే ఇబ్బంది పడుతున్న ప్రజలకు.. ప్రత్యామ్నాయంగా చేపలు కనిపిస్తున్నాయి. మటన్ ధరలు అందుబాటులో లేకపోవటంతో మధ్యతరగతి జనం చేపలవైపే చూస్తున్నారు. అయితే, ప్రస్తుతం ఈ తరహా ప్రచారం జరుగుతూ ఉంటడంతో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు చేపల చెరువు యజమానులు కొనసాగుతున్న ఈ దందాపై మత్స్యశాఖ, వెటర్నరీ అధికారులు దృష్టి సారించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరి ఈ ప్రచారం నిజమేనా.. నిజంగానే బర్డ్ ఫ్లూ వైరస్ కారణంగా చనిపోయిన కోళ్లను చేపలకు ఆహారంగా వేస్తున్నారా అనేది తెలియాల్సి ఉంది. ప్రభుత్వ అధికారులు ఈ ప్రచారంపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

# బలప్రదర్శనకు జనసేన...



జనసేన ఆవిర్భావ వేడుకలు పిఠాపురంలో జరగనున్నాయి. మార్చి 14న పెద్ద ఎత్తున ఆవిర్భావ వేడుకలు నిర్వహించేందుకు పార్టీ శ్రేణులు సిద్ధమవుతున్నారు. ఈ సంధర్భంగా నిర్వహించే బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యేలా జనసేన అధినాయకత్వం ప్రణాళిక రూపొందించింది. ఎన్నికల్లో విజయం తర్వాత నిర్వహించనున్న తొలి ఆవిర్భావ సభ కావడంతో పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఇంతకు ఈ సభ బలనిరూపణ కోసమా? వాస్తవంగా ఆవిర్భావ సభనే అంటూ రాజకీయ విశ్లేషకులు పెద్ద స్థాయిలో చర్చ సాగిస్తున్నారు.ఏపీలో కూటమి ప్రభుత్వం పగ్గాలు చేపట్టడంలో జనసేన కీలకంగా వ్యవహరించిందన్నది బహిరంగ రహస్యమే. వెంటీలేటర్ పై ఉన్న టీడీపీకి బీజేపీతో జతచేయించి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఊపిరి అందించారని పలువురి అభిప్రాయం. ఇదే మాటను పలుమార్లు టీడీపీ అధినేత చంద్రబాబు కూడా చెప్పకనే చెప్పారు. అయితే కూటమి ఏకంగా 164 సీట్లలో విజయఢంకా మోగించింది. ఆ తర్వాత సీఎంగా చంద్రబాబు, డిప్యూటీ సీఎంగా పవన్ కళ్యాణ్ లు భాద్యతలు చేపట్టారు. ఈ ప్రభుత్వం ఇప్పటికే 8 నెలల పాలనా కాలాన్ని పూర్తి చేసుకుంది.అయితే ప్రభుత్వం వరకు ఓకే గానీ, కూటమిలోని పార్టీలు మాత్రం ఎవరి బలాన్ని వారు పెంచుకొనే పనిలో పడ్డారని చెప్పవచ్చు. ఇటీవల టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంను నిర్వహించగా, ఊహించని స్థాయిలో కోటికి పైగా సభ్యత్వ నమోదు సాగింది. అలాగే వైసీపీ నుండి వచ్చిన పలువురు నాయకులకు టీడీపీ వెల్ కమ్ చెప్పింది. పార్టీ కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వడంలో ఏమాత్రం వెనక్కు తగ్గినా ఊరుకొనే ప్రసక్తే లేదని ఇప్పటికే పలుమార్లు తమ ఎమ్మెల్యేలకు చంద్రబాబు క్లాస్ తీసుకున్నారు. మొత్తం మీద టీడీపీని మరింత బలోపేతం చేసేలా ఓ వైపు చంద్రబాబు, మరోవైపు నారా లోకేష్ తమ రాజకీయ పావులు కదుపుతున్నారు.ఇక కూటమిలో రెండో పార్టీగా రాష్ట్రంలో గుర్తింపు పొందిన పార్టీ జనసేన. ఇప్పటి వరకు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రభుత్వ పాలనా పరమైన అంశాలపై దృష్టి సారించారు. అలాగే జనసేనలో నెంబర్ ? 2 గా గల నాదెండ్ల మనోహర్ కూడా మంత్రి వర్గంలో ఉండడంతో పార్టీ క్యాడర్ కు అంతగా అందుబాటులో లేరని ప్రచారం. మరో జనసేన కీలక నేత, పవన్ సోదరుడు నాగబాబు పార్టీ వ్యవహారాలను చూస్తూ వస్తున్నారు. ఇటీవల చిత్తూరు జిల్లాలో పార్టీలో చేరికల నేపథ్యంలో నాగబాబు హాజరై, పార్టీలోకి వారిని సాదరంగా స్వాగతించారు. ఈ దశలోనే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మరికొందరు నేతలకు జనసేన కూడా స్వాగతం పలికింది. ఓ వైపు కోటికి పైగా సభ్యత్వ నమోదు పూర్తి చేసుకొని టీడీపీ క్యాడర్ హుషారుగా ఉండగా, ప్రస్తుతం జనసేన బలాన్ని కూడా పెంచుకోవాలన్న లక్ష్యం పార్టీ అగ్ర నాయకత్వంలో కనిపిస్తోంది.ఈ సందర్భంగానే పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో మార్చి 14న పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించేందుకు పవన్ సిద్ధమయ్యారు. ఎన్నికల్లో తమ పార్టీ వందశాతం స్ట్రైక్ రేట్ తో విజయాన్ని అందుకున్న తర్వాత నిర్వహిస్తున్న తొలి పార్టీ సమావేశం ఇది. ఈ భారీ బహిరంగ సభ ద్వారా పార్టీని మరింత బలోపేతం చేసుకొనేలా పవన్ ప్లాన్ చేసినట్లు టాక్ నడుస్తోంది. పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చేందుకు ఇప్పటి నుండే ఆయా జిల్లాల పార్టీ నాయకులకు తగు సూచనలు చేసినట్లు సమాచారం.ఆవిర్భావ వేడుకలను విజయవంతం చేసి, మళ్ళీ యావత్ దేశం దృష్టి ఆకర్షించేలా చేయాలన్నది పవన్ అభిమతమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కూడా విస్తృతం చేసి, పార్టీ క్యాడర్ కు ఇప్పటి నుండి అందుబాటులో ఉండాలని పవన్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. 2029 ఎన్నికల సమయానికి రాష్ట్ర వ్యాప్తంగా జనసేనకు ప్రతి గ్రామంలో క్యాడర్ ఉండాలన్నది పవన్ అభిమతమట. మొత్తం మీద పిఠాపురం జనసేన ఆవిర్భావ సభ.. బల నిరూపణ సభ కానుందని రాజకీయ విశ్లేషకుల మధ్య తీవ్రస్థాయిలో చర్చ సాగుతోంది.

# టీడీపీ టార్గెట్ లో మరో ఇద్దరు వైసీపీ నేతలు



కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన ఎనిమిది నెలల తర్వాత వైసీపీ కీలక నేతల అరెస్ట్ లు ప్రారంభమయ్యాయి. బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ ను ఒక మర్డర్ కేసులో జైలుకు పంపారు. అదే సమయంలో మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సయితం నెల్లూరు జైలు లో కొద్ది రోజులు ఉండి తర్వాత బెయిల్ పై బయటకు వచ్చారు. తాజాగా వల్లభనేని వంశీ అరెస్ట్ కావడంతో తర్వాత గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నానిని అరెస్ట్ చేస్తారన్న ప్రచారం జోరుగా జరుగుతుంది. కొడాలి నాని ఇప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారని అంటున్నారు. తాజాగా మరో మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ పేరు కూడా అదే స్థాయిలో వినపడుతుండటం విశేషం.వెల్లంపల్లి శ్రీనివాస్ జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పై వ్యక్తిగత విమర్శలు చేసి కూటమి ప్రభుత్వం ఆగ్రహానికి గురయ్యారు. దీంతో పాటు ఆయనపై అనేక కేసులు నమోదు కావడానికి సిద్ధంగా ఉన్నాయని తెలిసింది. మంత్రిగా ఉన్న సమయంలోనూ, పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు దుర్గగుడి లో జరిగిన అవినీతిపై అనేక ఆరోపణలున్నాయి. దీనికి సంబంధించిన ఫిర్యాదుల కోసం వెయిట్ చేస్తున్నారు. ఫిర్యాదు వచ్చిన వెంటనే వెల్లంపల్లి శ్రీనివాస్ పై కేసు నమోదు చేసే అవకాశముంది. దీనికి సంబంధించిన ఆధారాలను సేకరించడంలో ఒక బృందం బిజీగా ఉందని చెబుతున్నారు. వెల్లంపల్లి శ్రీనివాస్ పై వచ్చిన ఆరోపణలకు సంబంధించిన ఆధారాలను సిద్ధం చేస్తున్నారు.వెల్లంపల్లి శ్రీనివాస్ అనేక పార్టీలు మారారు. తొలుత ప్రజారాజ్యం పార్టీలో చేరి 2009 లో ఆయన విజయవాడ పశ్చిమ నియోజకవర్గం నుంచి గెలిచారు. అనంతరం కాంగ్రెస్ లో ప్రజారాజ్యం విలీనం చేయడంతో వెల్లంపల్లి శ్రీనివాస్ కాంగ్రెస్ లో చేరిపోయారు. తర్వాత బీజేపీలో చేరారు. అనంతరం వైసీపీలో చేరి 2019 ఎన్నికల్లో పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలిచారు. తర్వాత జగన్ కేబినెట్ లో దేవాదాయ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన వెల్లంపల్లి శ్రీనివాస్ అధికారంలోకి రాగానే పవన్ కల్యాణ్ ను టార్గెట్ చేశారు. పవన్ కల్యాణ్ పై వ్యక్తిగతంగా విమర్శలకు దిగడంతో జనసైనికుల ఆగ్రహానికి గురయ్యారు. జగన్ ప్రాపకం సంపాదించడం కోసమే వెల్లంపల్లి శ్రీనివాస్ ఈ రకమైన వ్యాఖ్యలు చేశారన్న టాక్ ఉంది.గన్నవరం తర్వాత గుడివాడ.. ఆ తర్వాత విజయవాడ పశ్చిమ నియోజకవర్గం ను ప్రభుత్వం టార్గెట్ చేస్తుందన్న ప్రచారం ఉంది. దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో మంత్రి హోదాలో కనకదుర్గ దేవాలయంలో పాల్పడిన అవకతవకలు ఆయనకు ఉచ్చు బిగియనున్నాయి. టిక్కెట్ల విషయంలోనూ, చీరల అమ్మకాల్లోనూ అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో వెల్లంపల్లి శ్రీనివాస్ పై వరసగా కేసులు నమోదయ్యే అవకాశాలున్నాయని బెజవాడలో పెద్దయెత్తున ప్రచారం జరుగుతుంది. దీనిని ప్రచారంగా మాత్రమే కొట్టిపారేయాల్సిన అవసరం లేదని, త్వరలోనే మరికొందరు నేతలు జైలు పాలు కాక తప్పదన్న టీడీపీ నేతల హెచ్చరికలు ఇందుకు అద్దం పడుతున్నాయి.

# భయపెడుతున్న జీబీఎస్...

ప్రకాశం జిల్లా కొమరోలు మండలం అలసందలపల్లికి చెందిన కమలమ్మ అనే వృద్ధురాలు జీబీఎస్‌తో గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. 13 రోజుల పాటు చికిత్స పొందిన బాధితురాలు.. పరిస్థితి విషమించడంతో కన్నుమూసింది. మరో బాధితురాలు ఐసీయూలో చికిత్స పొందుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు జీబీఎస్ లక్షణాలతో శ్రీకాకుళం జిల్లా గోదాయవలసకు చెందిన యువంత్ అనే బాలుడు.. విశాఖలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. దీంతో ముందస్తు చర్యల్లో భాగంగా ఆ గ్రామంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి..అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే జీబీఎస్ అంటు వ్యాధి కాదని..ఇన్ఫెక్షన్ల బారినపడకుండా జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని సూచిస్తున్నారు.అరుదుగా లక్షమందిలో ఒకరిద్దరికే వచ్చే జీబీఎస్ అనే నరాల సంబంధిత వ్యాధి కేసులు ఏపీలో ఇటీవల ఒక్కసారిగా పెరగడం ఆందోళన కలిగిస్తోంది. గుంటూరు ప్రభుత్వాసుపత్రికి ఈ నెల 11న ఒక్కరోజే ఏడు కేసులు వచ్చాయి. వారిలో ఇద్దరు వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. ఇదే వ్యాధితో కాకినాడలో ఇటీవల ఇద్దరు చేరారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వాసుపత్రుల్లో ఈ వ్యాధితో 17 మంది చికిత్స పొందుతున్నారు. రాష్ట్రంలో ఒక్కసారిగా జీబీఎస్ కేసులు పెరగడంతో ప్రభుత్వం అప్రమత్తమయింది. జీబీఎస్ కేసులపై సమీక్ష నిర్వహించిన ముఖ్యమంత్రి చంద్రబాబు..ప్రభుత్వ యంత్రాంగం అలర్ట్‌గా ఉండాలని సూచించారు.ఏపీ వ్యాప్తంగా గత ఏడాది 301 జీబీఎస్ కేసులు నమోదు కాగా.. ఈ ఏడాది ఇప్పటివరకూ 43 కేసులను గుర్తించినట్టు చెప్పారు..మంత్రి సత్యకుమార్. ప్రస్తుతం 17 మంది బాధితులు చికిత్స పొందుతున్నారని వివరించారు. 85 శాతం మందికి చికిత్స అవసరం లేకుండానే ఈ వ్యాధి తగ్గుతుందని..కేవలం 15 శాతం మందికి మాత్రమే చికిత్స అవసరమవుతుందని చెప్పారు..సత్యకుమార్. ఈ వ్యాధికి అవసరమైన చికిత్స సదుపాయాలతో పాటు వ్యాక్సిన్లు కూడా సరిపడా ఉన్నాయని..ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం ఖర్చు గురించి ఎక్కడా ఆలోచించకుండా.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించేందుకు తగినన్ని ఇంజెక్షన్లను అందుబాటులో ఉంచుతోందని స్పష్టం చేశారు. కరోనాలో జీబీఎస్ అంటు వ్యాధి కాదని.. జెనెటికల్ కూడా కాదని స్పష్టం చేశారు..ఏపీ హెల్త్ సెక్రటరీ కృష్ణబాబు. వ్యాధికి కచ్చితమైన కారకాలపై ఎలాంటి నిర్ధారణ లేదని..ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా జీబీఎస్ ఉందన్నారు. లక్షల్లో ఒకరికి మాత్రమే జీబీఎస్ వ్యాధి సోకే అవకాశం ఉంటుందని..వచ్చిన వారిలో కూడా 5 నుంచి 7 శాతం మాత్రమే మరణాలు సంభవిస్తున్నాయని చెప్పారు. ఒక్కసారిగా కాళ్లు చచ్చుబడినట్టు అనిపిస్తే..వెంటనే వైద్యులను సంప్రదించాలి..వ్యాధిని ముందుగా గుర్తిస్తే చికిత్స సులభమవుతుందని వివరించారు.గులియన్ బారే సిండ్రోమ్ అంటువ్యాధి కాకపోయినా.. అప్రమత్తంగా ఉండాల్సిదే. అయితే గతంలో పెద్దవారిలో మాత్రమే కనిపించే ఈ వ్యాధి.. ఇప్పుడు పిల్లలు, శిశువులకూ సోకడం ఆందోళన కలిగిస్తోంది. నూటికి 95 శాతం మంది వ్యాధిగ్రస్తుల్లో ఈ వ్యాధి ప్రాణాంతకం కాకపోయినా..సకాలంలో చికిత్స అందించకపోతే ప్రమాదం. ఇది ఒకరకంగా పక్షవాతం లాంటిదే. చాలావరకు ఇతరత్రా ఇన్‌ఫెక్షన్లు వచ్చినవారికే మొదలవుతుంది. వ్యాధి తీవ్రమైతే కండరాలు చచ్చుబడతాయి. వ్యాధి లక్షణాల్ని సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే నయం చేయవచ్చు. వేళ్లు, మడమలు, మణికట్టు వంటి చోట్ల సూదులతో పొడుస్తున్నట్లు అనిపించడం.. కాళ్లలో మొదలైన బలహీనత పైకి విస్తరించడం, కాళ్ల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

వ్యాధి తీవ్రమైతే శ్వాస తీసుకోవడంలోనూ ఇబ్బంది అవుతుంది. వారికి వెంటిలేటర్‌పై చికిత్స అందించాల్సి ఉంటుంది. నర్వ్ కండక్షన్, ఎలక్ట్రోమయోగ్రఫీ, సీఎస్‌ఎఫ్, ఎంఆర్‌ఐ వంటి పరీక్షలతో.. వ్యాధిని నిర్ధారిస్తారు. వ్యాధి సోకిన తొలి దశలోనే ఆస్పత్రిలో చేరితే.. 4 వారాల్లో కోలుకునే ఛాన్స్ ఉంటుంది. వ్యాధి ముదిరితే..కోలుకోవడానికి దాదాపు 6 నెలలు పట్టొచ్చు. అత్యధిక శాతం మందిలో ఇన్‌ఫెక్షన్ మొదలైన ఒకట్రెండు వారాల తర్వాతే ఇది బయటపడుతుంది. ఇతర ఇన్‌ఫెక్షన్లు వచ్చినా, కలుషితమైన నీరు, ఆహారం తీసుకున్నా ఈ వ్యాధి సోకే అవకాశాలున్నాయి. వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం..కాచి, వడబోసిన నీళ్లను తాగడం..ఉడికించిన ఆహారాన్ని తీసుకోవడం వంటి చర్యలతో వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు.

### 20 వేల వరకు ఇంజెక్షన్

ఇమ్యునోగ్లోబిన్ ఇంజెక్షన్ ధర రూ.20 వేల వరకూ ఉంటుందన్న మంత్రి.. జీబీఎస్ రోగులకు రోజుకు ఐదు ఇంజెక్షన్లు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అలా ఐదురోజుల పాటు ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు. మరోవైపు జీబీఎస్ కారణంగా ఏపీలో తొలి మరణం ఆదివారం సంభవించింది. ప్రకాశం జిల్లాకు చెందిన మహిళ జీబీఎస్ వ్యాధితో బాధపడుతూ గుంటూరు ఆస్పత్రిలో ఆదివారం ప్రాణాలు కోల్పోయింది. అయితే లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదిస్తే కోలుకోవచ్చని వైద్యులు చెప్తున్నారు. కాళ్ల తిమ్మిర్లు, పక్షవాతం వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

CK NEWS చంద్ర కాంత్ తెలుగు దినపత్రిక

# కమలంలో పీక్స్ కు చేరిన అంతర్గత పోరు...

తెలంగాణ బీజేపీలో మళ్లీ రచ్చ మొదలైందంటూ వార్తలు గుప్పుమంటున్నాయి. పార్టీలో సంస్థాగతంగా ఎన్నికలు నిర్వహించుకుంటున్న నేపథ్యంలో జిల్లా అధ్యక్షుల నియామకంపై విమర్శలు?పీక్ స్టేజ్‌కు చేరుకున్నాయి. మొదటి విడతలో 19 జిల్లాలకు అధ్యక్షులను నియమించిన కాషాయ పార్టీ? రెండో విడతలో నలుగురు పేర్లు ప్రకటించింది. దీంతో అధ్యక్షుల సంఖ్య 23కి చేరింది. మిగిలిన జిల్లాల్లో అధ్యక్ష ఎంపికను పెండింగ్‌లో పెట్టి ఊరిస్తూ వస్తోంది. అయితే అధ్యక్షుల ప్రకటనలో ఊరిస్తోందా.. లేక అనుకున్న వారికి ఇచ్చేందుకు యత్నాలా అనే వార్తలు గుప్పుమంటున్నాయి. తాజాగా ఎమ్మెల్యే రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలతో? ఆ వాదనలకు ఆజ్యం పోసినట్లు అయ్యిందనే కామెంట్స్ జోరుగా వినిపిస్తున్నాయిమహిళలకే పెద్దపీట వేస్తామంటూ ప్రేమ ఒలకబోసిన కమలం పార్టీ..ఇప్పటి వరకూ ప్రకటించిన 23 జిల్లాల అధ్యక్షుల్లో కేవలం ఒక్క మహిళకే అవకాశం ఇచ్చి..విమర్శలపాలవుతోంది. సంగారెడ్డి జిల్లా మినహాయిస్తే? హేమా హేమీలున్న జిల్లాలోనూ మహిళలకు.. ఒక్కరంటే.. ఒక్కరికీ కూడా అవకాశం ఇవ్వకపోవడంతో మహిళా నేతల నుంచి కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందట. అంతేకాదు? పార్టీలో పనిచేసే వారికి కాకుండా? ఇతరులకు ప్రాధాన్యత ఇస్తున్నారనే విమర్శలు కూడా ముందు నుంచే వినిపిస్తున్నాయి.సంస్థల ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని భారతీయ జనతా పార్టీ చెబుతోంది. గ్రామీణ స్థాయిలో పార్టీని పటిష్టం చేసేందుకు వ్యూహాలు రచిస్తున్నామని చెప్పుకుంటోంది. అందుకు భిన్నంగా నేతల తీరు కనిపిస్తోందని సొంత పార్టీలో చర్చ జరుగుతోందట. ఇప్పటికే.. బూత్, మండల స్థాయిలో కమిటీలను సైతం ఏర్పాటు చేశామని.. అందులో భాగంగానే ఆయా జిల్లాలకు అధ్యక్షులను నియమిస్తున్నామని రాష్ట్రనాయకత్వం చెబుతున్న మాట. ఇప్పటికే 19 జిల్లాలకు అధ్యక్షులను నియమించామని చెబుతున్న కాషాయ పార్టీ.. చెబుతున్న లెక్కలకు.. చేసే పనులకు పొంతన లేకుండా వ్యవహరిస్తోందని.. సొంత పార్టీ నేతలే చర్చించుకుంటున్నారట. తాజాగా మరో నాలుగు జిల్లాలకు అధ్యక్షులను నియమించడంతో మళ్లీ రచ్చ మొదలైందని పొలిటికల్ వర్గాల్లో టాక్ నడుస్తోంది. పార్టీలో ఫైర్ బ్రాండ్‌గా పేరు తెచ్చుకున్న రాజాసింగ్ వంతు వచ్చింది. ప్రకటించిన నాలుగు జిల్లాల్లో గోల్కొండ జిల్లాకు సంబంధించిన అధ్యక్షుడు నియామకం అంశంలో.. ఆయన రాష్ట్ర బీజేపీ నాయకత్వాన్ని ఎడాపెడా ఉతికి ఆరేశారట. ఎంఐఎం, బీఆర్ ఎస్ తో కుమ్మక్కై తిరిగిన.. ఉమా మహేంద్రకు? అధ్యక్ష పదవి ఎలా కట్టబెడతారంటూ మండిపడ్డారట. ఇప్పటికే అధ్యక్షులను ప్రకటించిన జిల్లాల్లో? మెజారిటీ జిల్లాల్లో అసంతృప్తి?. పీక్ స్టేజీలో ఉన్న నేపథ్యంలో రాజాసింగ్ చేసిన కామెంట్స్.. హాట్‌గా మారాయనే వార్తలు గుప్పుమంటున్నాయి. అసలే.. ఎంపిక విషయంలో ఇబ్బందుల్లో ఉన్న అధిష్టానానికి? రాజాసింగ్ లాంటి వ్యక్తి ప్రశ్నలతో ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొందంటూ ప్రచారం సాగుతోంది.తెలంగాణ బీజేపీ అంటే అందరికీ ఠక్కున గుర్తొచ్చేది ఎమ్మెల్యే రాజాసింగ్ పేరు. ఆ పార్టీలో ఆయన ఫైర్ బ్రాండ్‌గా పేరు తెచ్చుకున్నారు. ప్రత్యర్థులను తనదైన శైలిలో ఇరకాటంలో పెట్టే వ్యక్తిగా రాజాసింగ్‌కు ఫాలోయింగ్ కూడా ఉంది. అలాంటి వ్యక్తి.. సొంతపార్టీపై చేసిన హాట్ కామెంట్స్.. రాష్ట్ర నాయకత్వానికి కొరకరాని కొయ్యగా మారాయనే టాక్ నడుస్తోంది. రాజాసింగ్ అంటే..ఒక మతానికి ఫైర్ బ్రాండ్‌గా చెబుతుంటారు. బీజేపీకి సంబంధించిన హిందువులు? ఆయన్ను అమితంగా ఇష్టపడుతారు. అలాంటి నేతకు.. ఇప్పుడు పార్టీలో ఆదరణ కరువైందనే వార్తలు గుప్పుమంటున్నాయి. కొంతకాలంగా పార్టీ కార్యక్రమాల్లో ఎక్కడ కూడా రాజాసింగ్ కనిపించకపోవటంతో? వస్తున్న వార్తలకు మరింత బలం చేకూరునట్లు అవుతోంది.ఇక్కడే.. అసలైన ట్విస్ట్ ఉంది. నిజంగానే పార్టీ నేతలు? రాజాసింగ్‌ను దూరం పెడుతున్నారా.. లేక పార్టీ వ్యవహారాలు నచ్చక ఆయనే దూరంగా ఉంటున్నారా అనే చర్చ జోరుగా సాగుతోంది. ఉన్న ఫలంగా మరోసారి.. రాజాసింగ్ సొంత పార్టీపై సంచలనమైన వ్యాఖ్యలు చేయడంతో? ఆ పార్టీలో సంస్థాగతంగా ఏం జరుగుతోందో తెలియని గందరగోళ పరిస్థితుల్లోకి పార్టీ శ్రేణులు వెళ్లారనే టాక్ బలంగా వినిపిస్తోందిజిల్లాల అధ్యక్షుల నియామక అంశంలో? ఎంపీలు, ఎమ్మెల్యేలు.. వారి వారి నియోజకవర్గాలలో కొందరి పేర్లు ప్రతిపాదిస్తూ వారికే అధ్యక్ష పదవులు ఇవ్వాలని అధిష్టానానికి సూచనలు చేశారట. అందులో గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా తన నియోజకవర్గంలోని గోల్కొండ జిల్లాకు ఎస్సీ లేదా బీసీ నేతని జిల్లా అధ్యక్షుడుగా నియమించాలని అధిష్టానానికి సూచనలు చేసినట్టుగా తెలుస్తోంది. కానీ.. ఎంఐఎం, బీఆర్ఎస్ తో తిరిగిన ఉమా మహేందర్‌క అధ్యక్ష పదవి ఇవ్వడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారట. అంతేకాదు.. రెండు రోజులు పార్టీ నాయకత్వానికి డెడ్ లైన్ కూడా ఇచ్చారనే ప్రచారం సాగుతోంది. ఈలోగా అధ్యక్షుడి అంశంలో పార్టీ నిర్ణయం మార్చుకోకపోతే .. తామేంటో చూపిస్తామంటూ హెచ్చరికలు కూడా జారీ చేశారట.గోల్కొండ జిల్లా అధ్యక్షుడి ఎంపికపై రాజాసింగ్ ఆడియో రిలీజ్ చేశారు. అందులో.. తనపై ఎంత కుట్ర కోణం దాగి ఉందో తెలుస్తుందంటూ హాట్ కామెంట్స్ చేశారు. అధిష్టానానికి మాతో పని లేధని అనుకుంటున్నారా..? మాతో అవసరం లేదని అనుకుంటున్నారా.. అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసేశారు. హిందూ ధర్మాన్ని ఆచరించడం నేర్చుకున్నాను తప్ప? కొంతమంది చేస్తున్నట్టుగా బ్రోకరిజాన్ని నేర్చుకోలేదనంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి. హిందూ ధర్మం కాని బ్రోకరిజం వల్లే?? తెలంగాణలో ఎప్పుడో అధికారంలోకి రావాల్సిన పార్టీ వెనుకబడిపోయిందనేది రాజాసింగ్ వాదనగా తెలుస్తోంది. కొంతమంది ఉన్నంతకాలం.. తెలంగాణలో అధికారంలోకి రావడం కష్టమేనంటూ కాంట్రవర్సీ కామెంట్స్ చేశారు రాజాసింగ్. అవసరమైతే? పార్టీ నుంచి వెళ్లిపోవడానికి కూడా సిద్ధంగా ఉన్నానని.. తమకు పదవులు ముఖ్యం కాదంటూ.. పార్టీ నాయకత్వానికి చురకలు అంటించారు రాజాసింగ్.గత అసెంబ్లీ ఎన్నికల్లో.. బీసీ ముఖ్యమంత్రి నినాదంతో కమలదళం ఎన్నికలకు వెళ్లింది. మిషన్-90 లక్ష్యంతో.. 90 స్థానాలు సాధిస్తామని చెప్పుకొచ్చిన కమలం నేతలు?తొమ్మిది సీట్లు కూడా సాధించలేకపోయారు. అదే అంశంపైనా రాజాసింగ్ ఫైనల్ టచ్ కూడా ఇచ్చేపారేశారు. తన బ్రాడ్ కాస్టింగ్ మీడియా గ్రూపులో.. పార్టీని, పార్టీ నాయకత్వాన్ని టార్గెట్ చేస్తూ మెసేజ్ రిలీజ్ చేశారు. పార్టీలో బీసీ నినాదంపైనా రాజాసింగ్ గట్టిగానే విమర్శలు చేశారు. బీసీల పార్టీ అంటారు. బీసీ ముఖ్యమంత్రి అంటారు.. కానీ?స్టేట్ అధ్యక్షుడు, బీజేపీఎల్పీ ఫ్లోర్ లీడర్, మహిళా మోర్చా అధ్యక్షురాలుగా వేరే కులస్తులను నియమించారని.. ఇంకెక్కడి బీసీలంటూ రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు.. కాంట్రవర్శీగా మారాయట. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కులగణనపై ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతున్న నేపథ్యంలో రాజాసింగ్ వ్యాఖ్యలకు ప్రాధాన్యత సంతరించుకునే అవకాశం ఉందని పొలిటికల్ వర్గాల్లో టాక్ నడుస్తోంది.జిల్లాల అధ్యక్షుల నియామకం కావొచ్చు.. బీజేపీలో బీసీలకు ప్రాధాన్యత అంశంలో కావొచ్చు? రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలను బిజెపి అధిష్టానం ఎలా తీసుకుంటుందనే అంశం ఉత్కంఠగా మారింది. తన అవసరం పార్టీకి లేదా.. పార్టీ నుంచి వెళ్లమంటే ?ఈ క్షణమే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి వెళ్లిపోతానంటూ ఆయన చేసిన వ్యాఖ్యలపై.. రాష్ట్రనాయకత్వం ఎలాంటి చర్యలు తీసుకోనుందే చర్చ సాగుతోంది.



# తెలంగాణ కిచెన్.. సూప్.. సూప్..సూపర్!

చలికి గరంగరంగా గొంతు దిగాలంటే సూప్ ఉండాల్సిందే. వెజిటబుల్, నాన్ వెజ్ సూప్.. ఇలా ఎన్నో రకాలున్నాయి. వాటిలో థ్రిల్ చేసే త్రీ రెసిపీలే ఇవి. మరింకెందుకాలస్యం.. వెంటనే ఈ రెసిపీలు ట్రై చేయండి.

### గుమ్మడితో సూప్ తయారీకి కావాల్సినవి

**గుమ్మడికాయ ముక్కలు : పావు కిలో**
**ఉల్లిగడ్డ : ఒకటి**
**వెల్లుల్లి రెబ్బలు : మూడు**
**నీళ్లు : ఒక కప్పు**
**జాజికాయ పొడి : చిటికెడు**
**మిక్స్‌డ్ హెర్బ్స్ : అర టీస్పూన్**

తయారీ విధానం : ప్రెజర్ కుక్కర్‌లో గుమ్మడికాయ ముక్కలు, ఉల్లిగడ్డ, వెల్లుల్లి తరుగు వేయాలి. అందులో నీళ్లు పోయాలి. మూతపెట్టి పది నిమిషాలు ఉడికించాలి. తర్వాత ఆ మిశ్రమాన్ని మెత్తగా మెదపాలి. తర్వాత నూనె, ఒరెగానో, మిక్స్‌డ్ హెర్బ్స్, జాజికాయ పొడి, ఉప్పు వేసి కలపాలి. వాటితోపాటు కావాలంటే చక్కెరకూడా వేసుకోవచ్చు. మరికాసేపు మిశ్రమాన్ని బాగా ఉడికించాలి. చీజ్ వేసుకుని తింటే టేస్ట్ సూపర్‌గా ఉంటుంది.

### మష్రూమ్ సూప్ తయారీకి కావాల్సినవి

**బటన్ మష్రూమ్స్ : పావు కిలో**
**వెన్న : రెండు టేబుల్ స్పూన్లు**
**బిర్యానీ ఆకు : ఒకటి**
**ఉల్లిగడ్డ : ఒకటి**
**వెల్లుల్లి రెబ్బలు : మూడు**
**గోధుమపిండి : ఒక టేబుల్ స్పూన్**
**మిరియాల పొడి : అర టీస్పూన్**
**నీళ్లు, పాలు : ఒక్కో కప్పు**
**ఉప్పు : సరిపడా**
**కొత్తిమీర : కొంచెం**

తయారీ విధానం: బటన్ మష్రూమ్స్‌ని కడిగి, కట్ చేసుకోవాలి. పాన్‌లో వెన్న వేడి చేసి అందులో బిర్యానీ ఆకు, ఉల్లిగడ్డ తరుగు, వెల్లుల్లి తురుము వేసి వేగించాలి. అవి వేగాక మష్రూమ్స్ తరుగు కూడా వేసి కలపాలి. పాన్‌లో నీరంతా ఇంకిపోయాక, గోధుమపిండి వేసి కలపాలి. మూడు నిమిషాల వరకు కలుపుతూ వేగించాలి. తర్వాత మిరియాల పొడి వేసి కలపాలి. ఆపై నీళ్లు పోసి కలపాలి. కావాలంటే వెజిటబుల్స్ లేదా మష్రూమ్ ఉడికించిన నీటిని వాడొచ్చు. పాలు కూడా పోయాలి. చివరిగా ఉప్పు వేసి కలిపి, మూత పెట్టాలి. పొంగు వచ్చేవరకు మాదిరి మంట మీద ఉడికించాలి. మిశ్రమం దగ్గర పడ్డాక మరో ఐదు నిమిషాలు ఉడికించి, కొత్తిమీర చల్లాలి.

### సొరకాయతో సూప్ తయారీకి కావలసినవి

**సొరకాయ ముక్కలు : 350 గ్రాములు**
**నూనె : ఒక టేబుల్ స్పూన్**
**ఉల్లిగడ్డ : పావు కప్పు**
**వెల్లుల్లి తరుగు : ఒక టీస్పూన్**
**నీళ్లు : రెండు కప్పులు**
**మిక్స్‌డ్ హెర్బ్స్ పౌడర్ : ఒక టీస్పూన్**
**మిరియాల పొడి : అర టీస్పూన్**
**ఉప్పు : సరిపడా**

తయారీవిధానం : ప్రెజర్ కుక్కర్‌లో నూనె వేడి చేసి అందులో ఉల్లిగడ్డ, వెల్లుల్లి తరుగు వేసి వేగించాలి. అందులో సొరకాయ ముక్కలు వేసి కలపాలి. ఆపై నీళ్లు పోసి మూతపెట్టి రెండు విజిల్స్ వచ్చేవరకు లేదా పది నిమిషాలు ఉడికించాలి. ఆ తర్వాత నీటిని వడకట్టి పక్కన ఉంచాలి. ఉడికిన సొరకాయ, ఉల్లిగడ్డ, వెల్లుల్లి తరుగును మిక్సీజార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తర్వాత అదే ప్రెజర్ కుక్కర్‌లో వేసి వడకట్టిన నీటిని కూడా పోయాలి. ఆ మిశ్రమంలో మిరియాల పొడి, మిక్స్‌డ్ హెర్బ్స్ పౌడర్, ఉప్పు వేసి కలపాలి. క్రీమ్‌లా కావాలనుకుంటే చీజ్ కూడా వేసుకోవచ్చు. ఈ సూప్ నేరుగా తాగడమే కాకుండా.. బ్రెడ్ టోస్ట్‌తో కూడా ఎంజాయ్ చేయొచ్చు.



# రోజంతా ఉల్లాసంగా.. ఉత్సాహంగా ఉండటం ఇంత సింపులా.. ఓసారి ట్రై చేయండి..

రోజువారి పనులు, లక్ష్యాలు ఒత్తిడికి గురిచేస్తుంటాయి. దాంతో చిరాకు వస్తుంది. అలసటతో పనులు సరిగ్గా చేయలేం. మరి రోజంతా ఉల్లా సంగా, ఉత్సాహంగా ఉండాలంటే ఏంచేయా లంటే.. నిద్రలేచిన దగ్గర్నుంచీ ఎన్నో పనులతో సతమతమవుతుంటారు చాలామంది. రోజంతా ఉత్సాహంగా పని చేయాలన్నా, ఆరోగ్యంగా ఉం డాలన్నా ప్రతిరోజూ పొద్దున్నే చేయాల్సిన పనులు కొన్ని ఉన్నాయి. వాటితోపాటు చేయకూడనివి ఉన్నాయి.

నిద్ర లేవగానే పనుల్లో పడిపోతుం టారు చాలామంది. ఇది సరైంది కాదు. శరీరం చురుగ్గా ఉండాలన్నా, శక్తిస్థాయిలు పెరగాలన్నా.. కొద్దిపాటి వ్యాయామం తప్పనిసరి. అందుకే రన్నింగ్, యోగా ఇలా ఏదో ఒకటి చేయాలి. స్ట్రెచింగ్ వ్యాయామాలు చేసినా మంచిదే. ఉదయాన్నే మొబైల్, టాబ్లెట్ చూసే అలవాటు ఉంటే, వెంటనే మానుకోవాలి. ఎందుకంటే ఈమెయిల్స్, ఎస్ఎంఎస్ లను నిద్రలేచిన వెంటనే చూడటం వల్ల, ఆలోచనలు కూడా ఆ విషయాల చుట్టే తిరుగుతుంటాయి. ప్రశాంతతను దూరం చేసి చిరాకు తెప్పిస్తుంది. నిద్రలేచిన తర్వాత కప్పు కాఫీ, బ్రెడ్ లాంటివి తీసుకుంటుంటారు. వీటివల్ల రోజంతా శరీరానికి శక్తి అందదు. శరీరంలో నెమ్మదిగా విడుదలయ్యే పిండి పదార్థాలు, పీచులాంటి ఆహారం తీసుకునేలా ప్లాన్ చేసుకోవాలి. ఓట్ మీల్స్ లో పండ్లు, నట్స్ వేసుకుని తినడం అలవాటు చేసుకుంటే బాగుంటుంది. కొందరు నిద్రలేచాక కాఫీ తాగుతూ టీవీ ముందు కూర్చుంటారు. అలా మనకు తెలియకుండానే మిగిలిన పనులు వాయిదా వేస్తాం. దాంతో ఆందోళన పెరిగిపోతుంది. ఇలాంటి విషయాలకు దూరంగా ఉంటే రోజంతా ఉల్లాసంగా ఉండొచ్చు.

# ఆ విషయంలో లక్కీ అంటున్న మీనాక్షి



ప్రస్తుతం టాలీవుడ్ లో బాగా వినిపిస్తున్న హీరోయిన్ పేరు మీనాక్షి చౌదరి. వరుస సినిమాలతో కెరీర్లో ఫుల్ బిజీగా ఉన్న మీనాక్షికి ఇప్పుడు అవకాశాలు క్యూ కడుతున్నాయి. ఇచట వాహనములు నిలుపరాదు సినిమాతో హీరోయిన్ గా టాలీవుడ్ లోకి అడుగుపెట్టిన ఈ హర్యానా భామ ఇప్పుడు సెన్సేషన్ గా మారింది. యంగ్ హీరోల నుంచి స్టార్ హీరోల వరకు అందరితోనూ ఛాన్స్ అందుకుంటుంది. దీంతో అందరూ మీనాక్షిని లక్కీ హీరోయిన్ ను చేసేశారు. మహేష్ బాబు తో గుంటూరు కారంలో ఆఫర్ రావడంతో అమ్మడి దిశ తిరిగిపోయిందనుకున్నారు. కానీ ఆ మూవీలో అమ్మడి పాత్రకు పెద్దగా ప్రాధాన్యత లేకపోవడంతో మీనాక్షి ఫ్యాన్స్ నిరాశ చెందారు. తమిళంలో కూడా విజయ్ గోట్ సినిమాలో ఛాన్స్ అందుకుంది కానీ ఆ సినిమాలో కూడా తన పాత్రకు ప్రాధాన్యత ఉండదు. అయితే గోట్ సినిమాను ఒకే చేసి తొందరపడ్డాననే అభిప్రాయాన్ని మీనాక్షి చౌదరి రీసెంట్ గా ఓ ఇంటర్వ్యూలో తెలిపింది. సింగపూర్ సెలూన్ సినిమాతో తమిళ ఇండస్ట్రీకి పరిచయమైన మీనాక్షి ఆ తర్వాత కొలై సినిమా చేసింది. ఆ తర్వాత విజయ్ తో కలిసి గోట్ సినిమా చేసింది. అయితే గతేడాది అమ్మడు నటించిన లక్కీ భాస్కర్ సూపర్ హిట్ అవడంతో తనకు క్రేజ్ పెరిగింది. ఇక రీసెంట్ గా తెలుగులో విక్టరీ వెంకటేష్ తో కలిసి చేసిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా సూపర్ హిట్ తర్వాత తన ఫాలోయింగ్ మరింత పెరిగింది. వరుస హిట్స్ లో ఉన్న మీనాక్షికి ఈ ఇయర్ ఎంతో స్పెషల్ అని, తన లైఫ్ లో ఈ సంవత్సరం ఎప్పటికీ గుర్తుండిపోతుందని మీనాక్షి వెల్లడించింది. ఇండస్ట్రీలో ఎంతో అనుభవమున్న వారికి కూడా మంచి కథల్లో నటించే అవకాశాలు రావడం లేదని, అలాంటిది తనకు కెరీర్ స్టార్టింగ్ లోనే పలు మంచి సినిమాల్లో నటించే ఛాన్స్ వచ్చినందుకు తాను చాలా అదృష్టవంతురాలిగా భావిస్తున్నట్టు మీనాక్షి తెలిపింది.



**షాలినీ పాండే తన సరికొత్త వేషధారణతో అభిమానులను ఆకట్టుకుంది**



**అనుపమ పరమేశ్వరన్ వార్డ్రోబ్ మనకు తీవ్రమైన స్టైల్ గోల్స్ ఇస్తోంది**

# విశ్వక్సేన్.. ఏడాదిలో ఎంత డౌన్‌ఫాల్



ఏ బ్యాగ్రౌండ్ లేకుండా టాలీవుడ్లోకి అడుగు పెట్టి.. కేవలం తన ప్రతిభతో తక్కువ టైంలో స్టార్ ఇమేజ్ సంపాదించిన నటుడు విశ్వక్సేన్. అతను చేసిన సినిమాలకు తోడు ఇప్పటి యువతకు ప్రతిబింబంలా కనిపించే అగ్రెసివ్ యాటిట్యూడ్ అతడి ఫాలోయింగ్ పెరగడానికి కారణమైంది. తన సినిమాలను విశ్వక్ ప్రమోట్ చేసే తీరు ఇండస్ట్రీలో మిగతా యంగ్ హీరోలకు ఒక పాఠం అనే చెప్పాలి. ఐతే ప్రమోషన్లు సినిమా ఓపెనింగ్‌కు ఉపయోగపడతాయి కానీ.. అంతిమంగా ఫలితాన్ని నిర్దేశించేది కంటెంటే. కానీ ఈ విషయంలోనే విశ్వక్ తడబడుతున్నాడు. చకచకా సినిమాలైతే చేసేస్తున్నాడు కానీ.. వాటిలో కంటెంట్ గురించి పెద్దగా పట్టించుకుంటున్న సంకేతాలు కనిపించడం లేదు. విశ్వక్ లేటెస్ట్ రిలీజ్ 'లైలా' తన కెరీర్లోనే అత్యంత పేలవమైన చిత్రంగా పేరు తెచ్చుకుంది. తన జడ్జిమెంట్‌ను ప్రశ్నార్థకం చేసిందీ చిత్రం. తన కెరీర్లో ఫెయిల్యూర్లు ఉన్నాయి కానీ.. ఇంతగా విశ్వక్ సినిమా మీద ఎప్పుడూ విమర్శలు వచ్చింది లేదు. విశ్వక్ నెమ్మదిగా ప్రేక్షకుల నమ్మకాన్ని కోల్పోతున్నాడనడానికి.. తన సినిమాలకు వస్తున్న ఓపెనింగ్సే రుజువు. ఏడాది వ్యవధిలో తన సినిమాల ఓపెనింగ్ కలెక్షన్లను పరిశీలిస్తే ఆ విషయం అర్థమవుతుంది. గత ఏడాది మార్చిలో రిలీజైన విశ్వక్ మూవీ 'గామి' పట్ల ప్రేక్షకుల్లో అమితాసక్తి వ్యక్తమైంది. దానికి వరల్డ్ వైడ్ తొలి రోజు రూ.8 కోట్లకు పైగా వసూళ్లు రావడం విశేషం. ఐతే విశ్వక్ కెరీర్లో అదొక స్పెషల్ మూవీ. దాని కంటెంట్, విజువల్స్ అన్నీ కూడా వేరే లెవెల్లో కనిపించాయి. దాంతో పోలిస్తే తర్వాతి చిత్రం 'దాస్ కా దమ్కీ' డే-1 కలెక్షన్లు తగ్గాయి. ఐతే రూ.4.5 కోట్లతో అది కూడా బాగానే పెర్ఫామ్ చేసింది. విశ్వక్ మార్కెట్ స్థాయికి అది కూడా మంచి కలెక్షనే. కానీ ఏడాది చివర్లో వచ్చిన 'మెకానిక్ రాకీ'కి వసూళ్లు బాగా పడిపోయాయి. తొలి రోజు కోటిన్నర కలెక్షనే రాబట్టింది 'మెకానిక్ రాకీ'. దానికి యావరేజ్ టాక్ వచ్చింది. ఇక వర్తమానంలోకి వస్తే 'లైలా' కేవలం 1.25 కోట్ల డే-1 వసూళ్లకు పరిమితం అయింది. ఏడాది కిందట విశ్వక్ చిత్రం ఒకటి రూ.8 కోట్లు కొల్లగొడితే.. ఇప్పుడు అందులో ఐదో వంతు వసూళ్లే వచ్చాయి. దీన్ని బట్టే అతడి డౌన్ ఫాల్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.